వైసీపీ మేనిఫెస్టో శుద్ధ దండగ..



వైసీపీ మేనిఫెస్టో శుద్ధ దండుగ. సంపద సృష్టించే అవకాశం లేదు. కార్మికులు, కర్షకులకు ఎలాంటి ఉపయోగం లేదు. యువతకు భరోసా లేదు. మేనిఫెస్టో అంతా బోగస్. రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని సంక్షేమం అభివృద్ధి పరిశ్రమలకు సంబంధించి ఎలాంటి భరోసా లేదు.

- గాలి చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి, కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి

వైసీపీలో నిర్వేదం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో వైసీపీ క్యాడర్‌లోనే తీవ్ర నిరుత్సాహం.. నిర్వేదం నింపుతోంది. టీడీపీకి ధీటుగా మేనిఫెస్టో ఉంటుందని వైసీపీ నేతలు ఆశించారు. అయితే జనాలను ఆకట్టుకోని రీతిలో ఉన్న మేనిఫెస్టో చూసి వైసీపీ శ్రేణులే పెదవి విరుస్తున్నాయి. ఇదేం మేనిఫెస్టో బాబోయ్ అంటూ తలలు పట్టుకుంటున్నారు. ఇలాగైతే .. జనం వద్దకు ఎలా వెళ్లాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేనిఫెస్టోలో కనీసం రైతు సంక్షేమం కోసం ఎలాంటి ప్రాధాన్యతనివ్వలేదు. ఇలాగైతే ఎన్నికలకు ఎలా వెళతాం. 2019 ఎన్నికల్లో జగన్ భారీ ఎత్తున హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు జగన్ విడుదల చేసిన మేనిఫెస్టును చూసి నిర్వేదంలో పడ్డారు. ఒక వైపు టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలు, వైసీపీ మేనిఫెస్టోను పోల్చుకుంటూ వైసీపీ శ్రేణులు డీలా పడుతున్నారు.

- మేనిఫెస్టోపై సొంతపార్టీ కేడరే పెదవివిరుపు
- ఇలా ఉంటుందని ఊహించలేదంటూ ఆవేదన
- జనాల్లో స్పందన నిల్
- ఓట్ల కోసం ఎలా వెళ్లాలి
- ఏం చేశామని.. అడగాలి
- రైతు రుణమాఫీ ఆశలపై నీళ్లు
- సూపర్‌సిక్స్‌తో టీడీపీ దూకుడు
- జనాల్లో కనెక్ట్ అయిన పథకాలు

(కడప-ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో బటన్ నొక్కుడు తప్ప అభివృద్ధి అంతంత మాత్రమే. ముఖ్యంగా పల్లెల్లో గ్రామ సచివాలయాలు, భవనాలు మినహాయిస్తే కనీసం చాలా చోట్ల రోడ్లు వేయని పరిస్థితి ఉంది. వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. ఐదేళ్లలో చేసిందేమీ లేదు. బటన్ నొక్కుడు తప్ప అర్హులైన వారందరికీ పథకాలు ఇవ్వలేని పరిస్థితి. లబ్ధిదారుల సంఖ్య ఏటా పెరుగుతుంటుంది. టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలకు పెద్దగా నిబంధనలు ఉండేవి కావు. అయితే జగన్ సంక్షేమ పథకాల కోసం స్క్రూటీని చేసి కోత కోశారు. కరెంటు బిల్లు, ఫోర్‌వీలర్, ఇంటి విస్తీర్ణం ఇలా రకరకాలు సాకులు చూపి లబ్ధిదారులకు కోత పెట్టారు. లబ్ధిదారుల సంఖ్య పెరగాలి కానీ తగ్గుతూ వచ్చింది. ఇక వైసీపీ బ్యాచ్ స్థలాలు కొట్టేయడం తప్ప ఏమీ లేదు. కనీసం మేనిఫెస్టో మంచిగా ఉంటే.. దాన్ని అడ్డుపెట్టుకుని ఓట్ల కోసం వెళదామనుకున్నారు.

ఇదేం.. మేనిఫెస్టో

అమ్మఒడి రూ.15వేల నుంచి 17వేలకు.. అంటే 2వేలు పెంచారు. గత ఎన్నికల్లో అమ్మఒడి ఇంట్లో అందరికీ ఇస్తామని చెప్పి చివరికి ఒకరికే ఇచ్చారు. అది కూడా పాఠశాల నిర్వహణ అంటూ 13వేలు ఇచ్చారు. ఐదేళ్లకు నాలుగుసార్లు ఇచ్చారు. ఇప్పుడు కేవలం రూ.2వేలు పెంచారు. అయితే చంద్రబాబు తల్లికి వందనం పేరుతో టీడీపీ అధికారంలోకి వస్తే అమ్మఒడి 15వేలు ఇస్తామని, ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి అమ్మఒడి ఇస్తామని చెప్పారు. ఇక జగన్ రైతు భరోసా 16వేలకు పెంచారు. గత ఎన్నికల్లో 13,500 ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే సీఎం అయ్యాక కేంద్రం ఇచ్చే ఆరు వేలతో కలుపుకుని 13500 మాత్రమే ఇచ్చారు. ఇప్పుడు కేవలం రూ.2500 మాత్రమే పెంచారు. చంద్రబాబు అన్నదాత సుఖీభవ ద్వారా ఏడాదికి 20వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. వద్ధాప్య పించను రూ.3500కు అది కూడా రెండు విడతల్లో ఇస్తామన్నారు. పెంచింది 2028 జనవరిలో 250, తరువాత 250 అంటే మళ్లీ 2029 ఎలక్షన్స్ ముందు రెండు విడతల్లో 500 పెంచుతారు. అదే చంద్రబాబు సీఎం అయితే రూ.4వేలు పించను ఇస్తామన్నారు. అంతేకాదు ఏప్రిల్ నుంచే మే, జూన్ నెలలకు వెయ్యి వెయ్యి చొప్పున మొత్తం జూన్‌లో రూ.7వేలు ఇస్తామని హామీ ఇచ్చారు.

రైతుల్లో నిరుత్సాహం

మేనిఫెస్టో అన్ని వర్గాలను నిరుత్సాహపరిచింది. రైతు ప్రభుత్వమని చెప్పుకునే జగన్ అండ్ కో రైతులకు చేసింది శూన్యమని చెప్పాలి. రైతు భరోసా కేవలం 2వేలు పెంచారు. టీడీపీ హయంలో రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇచ్చారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇచ్చారు. జగన్ సర్కారు వాటికి మంగళం పాడేసింది. కనీసం మేనిఫెస్టోలో రైతుల కోసం రుణమాఫీ ప్రకటిస్తారని వైసీపీ శ్రేణులు గంపెడాశలు పెట్టుకున్నాయి. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల కరువు తలెత్తింది. తాగడానికి నీళ్ల లేని పరిస్థితి. అయితే కరవు జిల్లాగా ప్రకటించలేదు. దీంతో రైతులు చాలా ఆగ్రహంగా ఉన్నారు. కనీసం మేనిఫెస్టోలో అయినా వారిని శాంతింపజేస్తారునుకుంటే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

టీడీపీ దూకుడు


రాజమండ్రి మినీ మహానాడులో టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలు ప్రవేశపెట్టింది. వాటిని ఇంటింటికీ తీసుకెళ్లారు. టీడీపీ అధికారంలోకి వస్తే తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలుంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15వేలు, రైతులకు ఏడాదికి రూ.20వేలు, మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్ల నిండిన మహిళకు ప్రతి నెలా 1500, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం మహిళలను బాగా ఆకట్టుకుంది. దీంతో పాటు ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటులో 20 లక్షల ఉద్యోగాల ప్రకటన. ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు ఇస్తామని ప్రకటించింది. ఇంకా కూటమి మేనిఫెస్టో విడుదల కాలేదు. అయితే సూపర్ సిక్స్ పథకాలు ఇప్పటికే జనాల్లోకి బాగా వెళ్లడంతో వైసీసీ శ్రేణుల్లోకలవరం పుట్టుకుంది. ఫైనల్‌గా పూర్తి స్థాయి మేనిఫెస్టో విడుదల చేయాల్సి ఉంది.

జిల్లాలో జగన్ బహిరంగసభలు

సీఎం సొంత జిల్లాలో టీడీపీ అనూహ్యంగా పుంజుకుంది. సొంతగడ్డలో వార్ వన్‌సైడ్ అనుకున్న వైసీపీకి తత్వం బోధపడింది. అన్ని చోట్ల టీడీపీ గట్టి పోటీ ఉండడంతో సీఎం జగన్ సొంత జిల్లాపై దృష్టిపెట్టారు. జిల్లాలో పలు బహిరంగసభలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 30న మైదుకూరులో జరిగే బహిరంగసభలో సీఎం జగన్ పాల్గొంటారు. అలాగే మే4న జమ్మలమడుగులో బహిరంగసభ ఉంటుంది. ఇప్పటికే జగన్ మేం సిద్ధం పేరిట ఇడుపులపాయ నుంచి బస్సుయాత్ర చేశారు. ఇక నామినేషన్ సందర్భంగా నెల 25న పులివెందులలో బహిరంగసభ పెట్టారు. వారం రోజుల వ్యవధిలోనే మళ్లీ జిల్లాకు వస్తున్నారు. దీంతోపాటు ఇంకా మరికొన్ని బహిరంగసభల్లో జగన్ పాల్గొంటున్నట్లు చెబుతున్నారు. టీడీపీతో పాటు సొంత చెల్లి షర్మిల కాంగ్రెస్ కడపపార్లమెంటు నుంచి బరిలో దిగుతోంది. ఇప్పటికే బస్సుయాత్ర మొదలైంది. వివేక కూతురు సునీత జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఒక పక్క టీడీపీ మరో పక్క సొంత చెల్లెళ్లు జగన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. దీంతో జగన్ కుటుంబీకులు కూడా ప్రచారం చేస్తున్నారు. జగన్ సతీమణి భారతి ఆదివారం పులివెందుల నియోజకవర్గంలో ప్రచారం చేపట్టారు. కడప ఎంపీ అవినాష్ సతీమణి, కుటుంబీకులు ఇప్పటికే ప్రచారం చేస్తున్నారు. మొత్తానికి వార్ వన్‌సైడ్ అనుకున్న వైసీపీకి తత్వం బోధపడింది.



బోగస్ మేనిఫెస్టో..



సీఎం జగన్ ప్రకటించిన వైసీపీ మేనిఫెస్టో బోగస్. 2019 ఎన్నికలప్పుడు జగన్ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేశారు. ఎన్నో హామీలు ఇచ్చారు. వాటిని జనం నమ్మారు. అయితే ఎన్నికల రోజున నవరత్నాలు అంటూ చిన్నసైజు మేనిఫెస్టో విడుదల చేసి జనాలను మోసం చేశారు. మద్యపానం నిషేధం చేసి మళ్లీ ఓట్లు అడుగుతానన్నారు. ఈ మేనిఫెస్టోలో మద్యపాన నిషేధం లేదు. అమరావతి రాజధాని అని అప్పట్లో హామీ ఇచ్చారు. రైతు సంక్షేమం పూర్తిగా విస్మరించారు. ఈ మేనిఫెస్టో అంతా మోసం. జనాలు నమ్మరు. కనీసం వైసీపీ కార్యకర్తలు కూడా నమ్మడం లేదు.

- ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

తుస్సుమన్న వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో

- మాజీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య

కడప (మారుతీనగర్) ఏప్రిల్ 28: వైసీపీ విడుదల చేసిన ఎన్నికల మేనిపెస్టో తుస్సుమనడంతో సొంత పార్టీ నాయకులే పెదవి విరుస్తున్నారని టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య అన్నారు. ఆదివారం కడపలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దిశ దశా లేని మేనిపెస్టోలో కొత్త హామీలంటూ ఏమీ లేవన్నారు. గత 2019లో మేనిపెస్టోలో పొందుపరచిన అంశాలు ప్రస్తుత 2024 మేనిపెస్టోలో లేనేలేవన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగం ప్రస్థావనే లేకపోవడం విచారకరమన్నారు. ప్రత్యేక హోదా సాధనకోసం కేంద్రం మెడలు వంచి తెస్తామని చెప్పి చివరకు కేంద్రం వద్దే ఆయన మెడను వంచేశారన్నారు. మోసంతో ప్రతిసారి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి గెలుస్తామనుకోవడం సాధ్యం కాదన్నారు. ఎంత సేపు ప్రజల ఆస్తులను కొల్లగొట్టడం తప్ప చేసిన మేలంటూ ఒక్కటంటే ఒక్కటి కూడా లేదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు చలపతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

పరీక్షలను పర్యవేక్షిస్తున్న వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్



ప్రశాంతంగా ఏపీసెట్

- 84.83 శాతంమంది హాజరు


కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 28: జిల్లాలో ప్రశాంతంగా ఏపీసెట్ పరీక్ష జరిగింది. పరీక్షకు 84.83 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. వైవీయూ ఆధ్వర్యంలో కడప నగరంలో 8 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి పరీక్ష ప్రారంభమైంది. పరీక్షలను ప్రత్యేక అబ్జర్వర్లు, కళాశాల చీఫ్ సూపరింటెండెంట్లు పూర్తయ్యేవరకు పర్యవేక్షించారు. వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ కడప నగరంలో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఏపీ సెట్ ప్రాంతీయ సమన్వయ కర్త ప్రొఫెసరు పీఎస్ షావల్లి ఖాన్ మార్గదర్శకంలో పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో 8 కేంద్రాల్లో 2047 మంది పరీక్షలకు హాజరయ్యారని, 336 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షల్లో ఎటువంటి ఇబ్బందులు లేకండా కట్టుదిట్టంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఏపీ సెట్ స్పెషల్ అబ్జర్వర్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎన్.ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి కాదు.. జలగరెడ్డి

- కాంగ్రెస్ మీడియా చైర్మన్ తులసిరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 28: జలగ మనుషుల రక్తం పీల్చినట్లు జగన్ ప్రభుత్వం ధరలు, చార్జీలు, పన్నుల పెంచి ప్రజల రక్తం తాగుతోందని, అందువల్ల జగన్‌రెడ్డి తన పేరును జలగరెడ్డిగా, బాదుడు రెడ్డిగా మార్చుకుంటే సమంజసంగా ఉంటుందని కాంగ్రెస్ మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ పన్నుల వాత, ధరల మోత, చార్జీల వాత అన్న చందంగా జగన్ పాలన తయారైందన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఈ ఐదేళ్ల కాలంలో ప్రజలపై మూడు లక్షల కోట్ల రూపాయల అదనపు ఆర్థికభారం మోపారన్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడుల కంటే ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోలు, డీజిల్ ధరలు లీటరుకు రూ.5 నుంచి రూ.10 వరకు ఎక్కువన్నారు. మద్యం, ఇసుక, సిమెంటు, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. కరెంటు చార్జీలు ఎనిమిదిసార్లు పెంచారన్నారు. 50వేల కోట్ల రూపాయల అదనపు ఆర్థికభారం విద్యుత్ వినియోగదారుల మీద పడిందన్నారు. జగన్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చింది గోరంత, ప్రజల నుంచి లాక్కున్నది కొండంత అన్నారు.

2న కడపకు చంద్రబాబు రాక



(కడప-ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మే 2న సాయంత్రం కడపలో జరిగే ప్రజాగళంలో పాల్గొనన్నారు. ఆ రోజు మధ్యాహ్నం రాయచోటిలో సభలో పాల్గొని అనంతరం సాయంత్రం కడపలో జరిగే ప్రజాగళం, బహిరంగసభ, రోడ్‌షోలో పాల్గొననున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి ఆదివారం ఆంధ్రజ్యోతికి వెల్లడించారు.

ఆటలెలా.. ఆడాలి

వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో క్రీడా వికాసంపై కక్ష కట్టింది. ఉన్న అరకొర క్రీడా మైదానాలను ధ్వంసం చేసింది. దీంతో మైదానాలు నాశనమై దుమ్ము ధూళితో అధ్వానంగా తయారయ్యాయి. దీంతో అటు క్రీడాకారులు ఇటు వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వాలు అభివృద్ధి పరిచిన క్రీడా మైదానాలు, జిమ్ కేంద్రాలు, ఇండోర్ స్టేడియాలు ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఆఖరికి రూ.2కోట్లతో థర్డ్ కాలనీ లేఅవుట్ స్థలాలలో చేపట్టిన క్రీడా వికాస కేంద్ర భవన నిర్మాణ పనులు సైతం వైసీపీ ప్రభుత్వం రాగానే నిలిచిపోయాయి. దాదాపు ఐదేళ్లుగా పునాదుల దశకు భవనం పరిమితమైపోయింది.



మార్కెట్ నిర్మాణంతో దమ్ముతో నిండిపోయిన క్రీడా మైదానం

- క్రీడా మైదానంలో మార్కెట్ నిర్మాణం
- మైదానంలో పచ్చదనం మాయం
- ఎగిసి పడుతున్న దుమ్ము ధూళి
- ఆనవాళ్లు లేని వాకింగ్ ట్రాక్
- దుర్భరంగా మరుగుదొడ్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు అధికారులు



దుర్భరంగా వున్న మరుగుదొడ్లు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 28: రాయలసీమలోనే వాణిజ్య నగరంగా పేరొందిన ప్రొద్దుటూరు పేరు గొప్ప ఊరు దిబ్బలా తయారైంది. దాదాపు 3 లక్షల జనాభా వున్న పట్టణంలో వేలాది మంది బాల బాలికలు వున్నారు. వీరి క్రీడా వికాసానికి ఉన్న ఏకైక ఆట స్థలం మున్సిపల్ అనిబిసెంటు హైస్కూలు క్రీడా మైదానం. దాతలు పెద్ద మనుస్సుతో విద్యార్థుల క్రీడా వికాసం కోసం ప్రొద్దుటూరు పొలం సర్వే నెంబరు 360లో 5.13 ఎకరాలు, 361లో 7.60 ఎకరాల భూమిని పట్టణ నడిబొడ్డున క్రీడా మైదానం కోసం విరాళంగా ఇచ్చారు. వారి ఆశయాలకు తూట్లు పొడుస్తూ ఆ క్రీడా మైదానంలో తాత్కాలికం పేరిట కూరగాయల మార్కెట్ నిర్మిం చారు. ఇప్పటికే ఎగ్జిబిషన్ గ్రౌండ్ స్థలం 2.55 ఎకరాలు ప్రతి ఏడాది లీజుకు ఇచ్చి కోట్లాది రూపాయలు మున్సిపాలిటీ ఆదాయం పొందుతోంది. అయినా.. క్రీడా వికాసం కోసం గానీ విద్యార్థుల సౌకర్యాల కోసం గానీ ఆ నిధులు వెచ్చించడం లేదు.

వైసీపీ అధికారంలోకి వచ్చాక.. మైదానం విధ్వంసం

వైసీపీ అధికారంలోకి వచ్చాక వారి రాజకీయ ప్రాపకం కోసం ఎంతో మంది విద్యార్థులు చదువుకుంటూ చరిత్ర గలిగిన మున్సిపల్ అనిబిసెంటు హైస్కూలు మైదానాన్ని విధ్వంసం చేశారు. అక్కడ తాత్కాలిక కూరగాయల మార్కెట్ నిర్మించి పిల్లల చదువులను దెబ్బతీశారు. అంతేకాకుండా క్రీడా మైదానంలో దాదాపు 2.15 ఎకరాల స్థలంలో మార్కెట్ నిర్మించారు. క్రికెట్ గ్రౌండ్ మొత్తం 5.25 ఎకరాలుంటే అందులో 2.15 ఎకరాల మేర మార్కెట్ నిర్మించడంతో క్రీడా మైదానం కుంచించుకుపోయింది. గతంలో ఈ క్రీడా మైదానం అభివృద్ధి కోసం కొవ్వూరు బాలచంద్రారెడ్డి లాంటి అనేక మంది విరాళాలు ఇచ్చి మైదానంలో మట్టి తోలి చదును చేశారు. వైసీపీ ఎమ్మెల్యేగా వున్న రాచమల్లు ప్రసాద్‌రెడ్డి కూడా అధికారంలో లేనప్పుడు కొంత నిధులు ఇచ్చి మైదానం అభివృద్ధి కోసం పాటు పడ్డారు. కానీ వైసీపీ అధికా రంలోకి వచ్చాక ఆయన ఈ మైదానం పట్ల గానీ, క్రీడాకారుల, వాకర్స్ విజ్ఞప్తులను గానీ పట్టించు కోకుండా.. విద్యార్థుల సమస్యలు సైతం ఆలకించకుండా మైదానంలో కురగాయల మార్కెట్ నిర్మించారు. దీంతో క్రీడా మైదానం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. మట్టి దుమ్ము ఎగసి పడుతూ పచ్చికలేకుండా ఘోరంగా తయారైంది. గతంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు కేంద్రంగా వున్న క్రీడా మైదానం దుర్భరంగా తయారైంది.

సుప్రీంకోర్టు ఆదేశాలు బేకాతరు

పాఠశాల ప్రాంగణాల్లో, క్రీడా మైదానాల్లో ఎలాంటి మార్కెట్‌లు, ఇతర భవనాలు నిర్మించ కూడదని సుప్రీంకోర్టు ఆదేశాలు నిబంధనలు ఉన్నా లెక్కచేయకుండా.. ఆగమేగాల మీద మార్కెట్ నిర్మించేశారు. ఈ మార్కెట్ నిర్మాణంలో కూడా భారీ అవినీతి చోటు చేసుకుంది. మార్కెట్‌లో వ్యాపారస్తుల వద్ద డబ్బులు తీసుకుని.. మున్సిపల్ నిధులు రెండు కోట్లకు పైగా వెచ్చించారు. శివాలయం సర్కిల్లో మార్కెట్ ఎప్పుడు పూర్తవుతుందో తెలియదు. అప్పటి వరకు ఈ తాత్కాలిక మార్కెట్‌తో క్రీడా వికాసానికి ఆటంకం తప్పని పరిస్థితి నెలకొంది.

ఆనవాళ్లు లేని వాకింగ్ ట్రాక్

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అనిబిసెంట్ హైస్కూలు క్రీడా మైదానం మధ్యలో వాకర్స్ కోసం వాకింగ్ ట్రాక్ నిర్మించారు. నేడు ఆ వాకింగ్ ట్రాక్ ఆనవాళ్ల లేకుండా పోయింది. ఇందుకు ప్రధాన కారణం కురగాయ మార్కెట్ నిర్మాణ సమయంలో ఈ ప్రాంతంలో ట్రాక్టర్లు , టిప్పర్లు తిప్పారు. దీంతో అక్కడ మైదానంలో వున్న వాకింగ్ ట్రాక్ పూర్తిగా ధ్వంసం అయ్యింది.

పచ్చదనం మాయం

గతంలో మైదానం అంతా పచ్చదనం ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు వృద్ధులు, మహి ళలు పెద్దఎత్తున ఉదయం సాయంత్రం వేళల్లో మైదానికి వచ్చి ఆహ్లాదం అనుభవించేవారు. నేడు అక్కడ పచ్చిక మాయమై దుమ్ము, మట్టి ఎగసి పడుతోంది. కనీసం మైదానంలో మున్సిపాలిటీ వారు నీళ్ల కూడా చల్లించడం లేదని వాకర్స్ సీనియర్ సిటిజన్స్ వాపో తున్నారు.

జిమ్ కేంద్రాల పై నిర్లక్ష్యం

పురుషులు, స్త్రీల కోసం గత టీడీపీ ప్రభుత్వంలో అర్బన్ గ్రీనరీ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిమ్ కేంద్రాలు వైపీపీ ప్రభుత్వం వచ్చాక తీవ్ర నిర్లక్షానికి గురయ్యాయి. జిమ్ కేంద్రాలకు కంచెలు పోయాయి. పరికరాలు పాడై పోయి.. కనీసం గ్రీన్‌మ్యాట్‌లో గేట్లు విరిగి పోయినా ఈఐదేళ్ల కాలంలో వైసీపీ పాలకులుగానీ, ఆఖరికి మున్సిపల్ పాలక మండలి అధికారులు సైతం పట్టించుకోలేదు.

మరుగుదొడ్లు దుర్భరం

ప్రతిరోజు వందలాది మంది క్రీడా మైదానంలో వ్యాయామం, వాకింగ్ చేయడానికి పెద్దలు , మహిళలు, యువకులు వస్తుంటారు. క్రికెట్ షటిల్ ఆడటానికి పిల్లలు పెద్దఎత్తున వస్తు ంటారు. కానీ ఇక్కడ టాయిలెట్ వస్తే పరిస్థితి ఘోరం. మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన టాయిలెట్లు శుభ్రం చేయకపోవడంతో దుర్భరంగా వుంటున్నాయి. భయంకరమైన దుర్వాసనతో అందులోకి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

మున్సిపల్ అనిబిసెంటు క్రీడా మైదానం దుమ్ము ధూళితో ఘోరంగా ఉందని వాకర్స్ అసో షియేషన్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ రఘునాధరెడ్డికి ఫిర్యాదు చేశారు. అలాగే మహి ళలు కూడా జిమ్ కేంద్రానికి కంచెపోయిన విషయం ఆయన దృష్టికి తెచ్చారు. కనీసం ప్రతిరోజు దుమ్ము ఎగిసికుండా నీళ్ల చల్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు కమిషనర్ స్పందించి ప్రతిరోజు ట్రాక్టర్‌తో నీళ్ల చల్లేలా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రౌండ్ అభివృద్ధికి ఎన్నికల అయ్యాక చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మహిళల జిమ్‌కు కంచె తెగిపోయిన దృశ్యం



పురుషుల జిమ్‌లో గేటు విరిగిపోయిన దృశ్యం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టండి



జమ్మలమడుగు నియోజకవర్గ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

- ఎస్పీ సిద్ధార్థ కౌశల్

జమ్మలమడుగు, ఏప్రిల్ 28: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ పేర్కొన్నారు. ఆదివారం తలమంచిపట్నం పోలీసు స్టేషన్ పరిధిలోని దాల్మియా కర్మాగారంలో జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎన్నికల నేపథ్యంలో కార్యాచరణ ప్రణాళికపై దిశా నిర్దేశం ఇస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఘటనలకు తావు లేకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడినవారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మద్యం, నగదుతో ఓటర్లను ప్రలోభ పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల ప్రజలతో పోలీసులు, సత్సంబంధాలు పెంపొందించుకుని వారి వద్ద నుంచి ముందస్తు సమాచారం సేకరిస్తుండాలన్నారు. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, జమ్మలమడుగు డీఎస్పీ డాక్టర్ యశ్వంత్, ప్రొబెసనరి డీఎస్పీ శ్రీకాంత్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జి.రాజు, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్‌హసం, సీఐలు, ఎస్‌ఐలు, సెక్టార్ పోలీసు అధికారులు, స్పెషల్ బ్రాంచ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజలు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ సూచించారు. ఆదివారం మైలవరం మండలం తలమంచిపట్నం పోలీసు స్టేషన్ సందర్శించారు. అక్కడ చిన్నకొమెర్ల గ్రామస్థులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. పోలీసుశాఖ ఓటర్లకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎక్కడ ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటారని, పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లి ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్పీ తనిఖీ చేశారు.

వైసీపీకి మరొక్క చాన్స్ ఇస్తే... రాష్ట్రం నిలువుదోపిడీ

● వైసీపీ హయాంలో పరిశ్రమల ఊసే లేదు.. ● నిరుద్యోగులకు ఉపాధి కరువు ● కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి


కడప నగరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 28: ఐదేళ్ల క్రిందట ఒక్కచాన్స్ అని వైసీపీ నాయకులు అడగడంతో ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే రాష్ట్రాన్ని నిలువునా దోచేశారని టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం 13వ డివిజన్ పటేల్ రోడ్డులో రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్పు కావాలంటే తెలుగుదేశం ప్రభుత్వం రావాలని కోరారు. ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో రాష్ట్రంలో దోపిడీ, విధ్వంసం తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచకాలు దోపిడీలు జరిగాయన్నారు. ప్రజలు ప్రశాంతంగా బతకాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్రంలో 16 లక్షల మంది గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లకు చంద్రబాబు ఆధ్వర్యంలో ఫీజు రీయింబర్స్‌మెంటు అందించిందన్నారు. కానీ ప్రస్తుతం జగన్ ప్రభుత్వం కేవలం 8 లక్షల మందికి ఫీజు రీయింబర్స్‌మెంటు ఇవ్వడానికి నానా తంటాలు పడుతున్నారని అన్నారు. 2014-19 మధ్య కాలంలో టీడీపీ అధికారంలో ఉందని, ఆ మధ్యకాలంలో 4వేల మందికి పైగా విద్యార్థులను అంబేడ్కర్ విదేశీ విద్య ద్వారా విదేశీ చదువులను అందించినట్లు తెలిపారు. దీంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు ఎంతో ఆనందించారన్నారు. వారి తల్లి దండ్రులు కూడా టీడీపీ ప్రభుత్వానికి ధన్య వాదాలు తెలిపారన్నారు. అదే జగన్‌రెడ్డి సీఎం అయినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కరికి కూడా విదేశీ విద్య అందించలేకపోవడం మన దౌర్భాగ్యమన్నారు. అసలు రాష్ట్రంలో చదువు పూర్తిచేసిన విద్యార్థులు ఉద్యోగాలు లేక ఈ ఐదేళ్ల పాలనలో ఎంతో మంది దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. దీంతో వారు కుటుంబాలకు భారమై తల్లిదండ్రులపై ఆధారపడి జీవనం వెల్లదీయాల్సిన దుస్థితి ఏర్పాడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారంతా వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు మూడు సమ్మిట్‌ల ద్వారా 5.13 లక్షల ఉద్యోగాలు కల్పించడంలో కీలక పాత్రపోషించారన్నారు. కానీ జగన్ ప్రభుత్వంలో ఒక్క బిజినెస్‌సమ్మిట్ ద్వారా కేవలం 9150 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇవ్వగలిగారన్నారు. చంద్రబాబు ఐదు లక్షల వరకు వడ్డీ లేని డ్వాక్రా రుణాలు ఇస్తే జగన్‌రెడ్డి ప్రభుత్వం కేవలం 3 లక్షలకు అది కుదించినట్లు తెలిపారు. అంగన్వాడీ జీతాలను చంద్రబాబు 6300 కు పెంచారని, జగన్‌రెడ్డి కేవలం వెయ్యి మాత్రమే పెంచారన్నారు. ఎస్సీ బీసీ కార్పొరేషన్ రుణాలను చంద్రబాబు 4 లక్షల వరకు అందిస్తే జగన్ లోన్లు ఇవ్వకుండా పూర్తిగా నిలిపివేశారన్నారు. అన్నా క్యాంటిన్ల ద్వారా సుమారు 7.25 కోట్ల మందికి భోజనం అందించి ఆకలి తీర్చిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానికి దక్కిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నక్యాంటిన్లను నిర్లక్ష్యంగా మూసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మద్యానికి సంబంధించి క్వార్టర్ బాటిల్ మద్యం టీడీపీ హయాంలో 60 రూపాయలు ఉంటే దానిని వైసీపీ ప్రభుత్వం 120కి పెంచారని అలాగే జేబ్రాండ్‌లను తీసుకువచ్చి ప్రజల ఆరోగ్యంతో వైసీపీ ప్రభుత్వం ఆట్లాడుకుంటుందన్నారు. చంద్రబాబు నాయుడు ఆదరణ పథకం ద్వారా 4.26 లక్షల మందికి ఆధునిక ఉప కరణాలు పంపిణీ చేస్తే జగన్‌రెడ్డి ఆ పథకాన్ని సైతం రద్దు చేశారన్నారు. టీడీపీ రాష్ట్ర బెడ్జట్‌లో 19.5 శాతం ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి ఖర్చు చేసిందన్నారు. ఈ వైసీపీ ప్రభుత్వం విధ్వంసక పాలనలో రాష్ట్ర బడ్జెట్‌లో 15.80 శాతం మాత్రమే ఖర్చు చేసిందని ఆరోపించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో 98902 మందినతూన వధూవరులకు 50వేల చొప్పున అందించారని జగన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో 56194మందికి మాత్రమే సాయం చేశారన్నారు. రాష్ట్రబడ్జెట్‌లో 1523 కోట్లతో దాదాపు 2.5 లక్షల మందికి ఆశ్రయం కల్పించారన్నారు. వైసీపీ కేవలం 129 కోట్లను మాత్రమే ఖర్చు చేసిందని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో నిరుపేదలకు 12 లక్షలకు పైగా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిన జగన్‌రెడ్డికేవంల ఐదు లక్షల అగ్గిపెట్టెల్లాంటి ఇళ్లు మాత్రమేనిర్మించారన్నారు. ఇటువంటి మంచిపరిపాలన అందించిన చంద్రబాబు నాలుగు కాలాల పాటు ఉండాలని ప్రజలందరూ బాబును ఆశీర్వదించాలని చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే సంక్షేమం, అభివృద్ధి చెందుతుందన్నారు. స్వర్ణాంధ్ర సాకారం కోసం బాబును మళ్లీ సీఎంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోటీడీపీ సీనియర్ నాయకులు అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, దుర్గాప్రసాద్, మన్మోహన్‌రెడ్డి, గోవర్ధనరెడ్డి, పీరయ్య, రవిశంకర్‌రెడ్డి, ఎద్దుల రవి, అఫ్సర్‌ఖాన్, గురప్ప, బీజేపీ నాయకులు మధుసూదన్, జనసేన నాయకులు తుంగ రమణయ్యతో పాటు పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ... టీడీపీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

14వ డివిజన్‌లో...

కడప నగరం 14వ డివిజన్ పుట్లంపల్లెలో టీడీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున వైసీపీ నుండి టీడీపీలోకి స్థానికులు చేరారు. వారికి టీడీపీ జిల్లా అధ్యక్షులుశ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చంద్రమౌళీశ్వర్, జాకబ్, సురేష్, మురళి, టీడీపీ నాయకులు దివాకర్, ఉదయ్, సుబ్బరాయుడు, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

15వ డివిజనులో...

కడప నగరం 15వ డివిజన్‌లో టీడీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో స్థానికులు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అరాచకం ఎక్కువైందన్నారు. ప్రజలు తరిమికొట్టే సమ యం ఆసన్నమైందన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని అలాగే స్థానిక సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.


విక్టరీ సంకేతాన్ని చూపిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, పార్టీ శ్రేణులు


కడప నగరంలో ఇంటింటి ప్రచారంలో టీడీపీ బృందం

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 28: వైసీపీ మాజీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ (బూస్ట్) తన అనుచరులతో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం 14వ డివిజన్‌లో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ అరాచకాలు రోజురోజుకూ ఎక్కువైన కారణంగా వైసీపీలో ప్రారంభం నుంచి ఉన్న కార్యకర్తలు, నాయకులు పార్టీని వీడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అమీర్‌బాబు, ఎస్.గోవర్ధనరెడ్డితో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు


లఅంత్యక్రియలు నిర్వహిస్తున్న అభి చారిటబుల్ ట్రస్టు

వల్లూరు, ఏప్రిల్ 28 : మండలపరిధిలోని గంగాయపల్లె గ్రామానికి చెందిన గుర్రం మునిస్వామి అనే వృద్ధుడు అనారోగ్యంతో మరణించడంతో స్థానిక గ్రామస్తుడు పెంచల్‌రెడ్డి, దరిశా వెంకట సుబ్బయ్య, ఈవీ వెంకటసుబ్బారెడ్డి చక్రి అభిఛారిటబుల్ ట్రస్టుకు సమాచారం తెలపడంతో ట్రస్టు ఛైర్మన్ విజయబాబు అనాథ వృద్ధునికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం


నూతనంగా ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి

కడప (కల్చరల్) ఏప్రిల్ 28: కడప నగరం ఎన్‌జీఓ కాలనీలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ ఛైర్మన్ వి.సీతారామయ్య సారథ్యంలో ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు అష్ట బంధన మహా కుంబాభిషేక సంప్రోక్షణ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో నూతనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం కమనీయంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వి.నరసింహాచార్యుల సారథ్యంలో మధ్యాహ్నం 12 గంటలకు చేపట్టిన శ్రీవారి కళ్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కన్నులారా వీక్షించి భక్తిపారవశ్యం పొందారు. ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుగావించారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

● కడప ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో భూపేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి.. టీడీపీలో చేరిన శ్రీరామ్‌నగర్ స్థానికులు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 28 : ఒక్క అవకాశం ఇస్తే కడప జిల్లాకు అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం కడప నగరం 13వ డివిజనులో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అభివృద్ధి సంక్షేమం గురించి వివరంచారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలు అభివృద్ధిపథంలో దూసుకుపోతుంటే మన రాష్ట్రం వెనుకబడిందన్నారు. జగన్‌రెడ్డి రివర్స్‌పాలనతో ప్రజలజీవితాలు రివర్స్ అయ్యాయన్నారు. భవిష్యత్తు ప్రయాణాన్ని టీడీపీ చూసుకుంటుందన్నారు. చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి, దుర్గాప్రసాద్, గోవర్ధనరెడ్డి, పీరయ్య, మన్మోహన్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, ఎద్దుల రవి, అఫ్సర్‌ఖాన్, గురప్ప, జనసేన నాయకులు తుంగ రమణయ్య, బీజేపీ నాయకులు మధుసూధన్‌తో పాటు పెద్దసంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో డాక్టర్ల చేరిక: కడప నగరం ద్వారకానగర్‌లో శ్రీనివాసరెడ్డి నివాసంలో డాక్టర్ నిజాముద్దీన్ ఆధ్వర్యంలో నగరానికి చెందిన ప్రముఖ డాక్టర్లు టీడీపీలో చేరారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపడతే రాష్ట్రం సంక్షేమం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందన్నారు. కాగా డాక్టర్‌లు ఎం.సుభద్ర, గురుప్రసాద్, డివికే కుమార్, మహేష్, సద్దక్‌ఆలీ, ఎంరమణ, అబ్బాస్, జునైద్, క్రిష్ణ పాల్గొన్నారు. కడపనగరం 3వ డివిజన్ శ్రీరామ్‌నగర్‌లో వైసీపీ నుంచి టీడీపీలోకి అధికసంఖ్యలో మైనార్టీలు చేరారు. చేరినవారిలో శ్రీరామ్‌నగర్‌కు చెందిన గంపా సుబ్బయ్య, శ్రీను, బండారు మల్లిఖార్జున, తమ్మిశెట్టిఆంజనేయులు రాయచోటి రామక్రిష్ణ పాల్గొన్నారు.

ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి


చింతకొమ్మదిన్నెలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కలిగిస్తున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

సీకేదిన్నె, ఏప్రిల్ 28: ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు, భయానికి లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్పీ సిద్దార్థకౌశ్యల్ తెలిపారు. కమలాపురం నియోజకవర్గంలోని మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె గ్రామాన్ని ఆయన పరిశీలించి ప్రజలకు ఓటు హక్కుపై భరోసా కల్పించారు. ప్రజలు ఓటు హక్కును ప్రశాంతవాతావరణంలో నిర్భయంగా వాడుకోవచ్చున్నారు. ప్రజలకు అండగా పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ప్రజలు ప్రలోభాలకు, బెదిరింపులకు లొంగాల్సిన అవసరం లేదని ఎవరైనా అటువంటి ప్రలోభాలకు గురిచేస్తే పోలీసు శాఖకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసు శాఖ తగిన భద్రత కల్పిస్తుందని, సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ప్రజలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఏ చిన్న సంఘటన జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలి

అంతకుముందు మండల పరిధిలోని ఊటుకూరు రవాణా శాఖ కార్యాలయం సమీపంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పోలీసు అధికారులకు సార్వత్రిక ఎన్నికలకు పోలీసు అధికారులు సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని, ఎలాంటి ఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో కార్యాచరణ ప్రణాళికపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదే విధంగా గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడ్డవారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మద్యం, నగదుతో ఓటర్లను ప్రలోభపెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రబుల్ మాంగర్లు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లోని ప్రజలతో సత్సంబంధాలు పెంచుకుని సమస్యల గురించి ముం దస్తు సమాచారం ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. వీటి ద్వారా సమస్యలను గుర్తించి వాటిని మొదట్లోనే నిర్వీరపరిచేందుకు వీలవుతుందన్నారు. ప్రజల రక్షణే ధ్యేయంగా వారికి అన్నివిధాలా అండగా ఉండాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చారు.అదనపు ఎస్పీ ఎల్.సుధాకర్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, నియోజకవర్గంలోని పోలీసు సిబ్బంది, సికెదిన్నె సిఐ శివశంకర్‌నాయక్ పాల్గొన్నారు.


కడపలోని మెడ్‌కేర్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ మహబూబ్ అలీ

జగన్ ప్లాస్టర్ మాయం..కుట్లే లేవు: బీటెక్ రవి

వేంపల్లె, ఏప్రిల్ 28: గులకరాయి వేటుతో సానుభూతి పొందాలనుకున్న జగన్‌ను ఆ పార్టీ కార్యకర్తలే నమ్మడం లేదని, మొన్నటి వరకు ఉన్న ప్లాస్టర్ మాయమైందని, అసలు గాయమైనట్లు కుట్లు కూడా లేవని పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి వ్యాఖ్యానించారు. మండలంలోని చింతలమడుగుపల్లెలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాగా చింతలమడుగుపల్లెలో బీటెక్ రవి సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు.

గడ్డివామి దగ్ధం

ఖాజీపేట, ఏప్రిల్ 28: ప్రమాదవశాత్తు రావులపల్లెలో గడ్డివామికి నిప్పు తగులుకుని అగ్నికి ఆహుతైంది. రావులపల్లెకు చెందిన పోలు రామచంద్రారెడ్డి 700 కట్టలతో పశువులకోసం వామి ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం మంటలు తగులుకోవడంతో పూర్తిగా కాలిపోయింది.

మేడేను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

కడప (సెవెన్‌రోడ్స్), ఏప్రిల్ 28 : జిల్లాలో మేడేను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసులరెడ్డి, బి.మనోహర్ పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 186లో అమెరికాలోని చికాగో నగరంలో కార్మిక వర్గం 8గంటలు పనిదినం కోసం పెద్దఎత్తున పోరాటం చేశారని గుర్తు చేశారు. 8గంటల పనిదినాలు సాధించిన రోజే మేడే అన్నారు. కాగా 138 సంవత్సరాలుగా ఎన్నో వ్యయప్రాసాలకు ఓర్చి సాధించుకున్న హక్కులు కనుమరుగయ్యే పరిస్థితి కనబడుతోందన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా కాకుండా ఇప్పటికైనా కార్మికులు అందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. చాలా దుకాణాల్లో 12 నుంచి 15 గంటలు పనిచేస్తున్నారన్నారు. ప్రస్తుత పాలకులు పట్టించుకోవడ లేదన్నారు. ఎన్నికల కాలంలో మేడేని పెద్ద ఎత్తున నిర్వహించాలని తెలిపారు. మేడే సందర్భంగా మే 1వ తేదీన నగరంలో కార్పొరేషన్ కార్యాలయం నుంచి సాయంత్రం 6 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అక్కడ నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ కొనసాగి పాతబస్టాండు వద్ద బహిరంగసభ ఉంటుందని వివరించారు. ఈ బహిరంగ సభలో ఉపాధ్యాయ కార్మిక సంఘాలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయు నగర ప్రధానకార్యదర్శి వెంకటసుబ్బయ్య, కోశాధికారి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వైసీపీలో బాహాబాహీ

● వైఎస్ భారతి ప్రచారం ప్రారంభించే విషయమై ఘర్షణ

పులివెందుల, ఏప్రిల్ 28:తొండూరు మండలంలోని ఇనగలూరులో వైసీపీలోని మూడు వర్గాలు ఆదివారం బాహాబాహీకి దిగాయి. ఆదివారం సాయంత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి సతీమణి సమత ఇంటింటి ప్రచారానికి ఇనగలూరు గ్రామానికి వెళ్లారు. ఆ గ్రామంలో ఉన్న వైసీపీకి చెందిన మూడు వర్గాల నాయకులు, కార్యకర్తలు ఊరి శివార్లలో భారతి, సమత కోసం ఎదురుచూస్తున్నారు. మరో ఐదు నిమిషాల్లో వారు గ్రామంలోకి వస్తారనుకుంటున్న సమయంలో... ప్రచారం ఈ వీధిలో నుంచి ప్రారంభించాలంటే ఈ వీధిలో నుంచి ప్రారంభించాలని మూడు వర్గాలు పట్టుబట్టాయి. దీంతో మాటామాటా పెరిగి మూడు వర్గాలు కలబడి పిడిగుద్దులు కురిపించారు. ఇంతలో పోలీసులు రంగప్రవేశం చేసి అందరినీ చెదరగొట్టారు. పోలీసులు చెదరగొట్టే సమయానికి భారతి, సమతల కాన్వాయ్ అక్కడికి చేరుకుంది. అనంతరం ఆ వీధి ఈ వీధి అనుకోకుండా ప్రచారం నిర్వహించారు. భారతి, సమతల ప్రచారంలో మూడువర్గాల నాయకులు, ప్రజలు యధావిధిగా పాల్గొన్నారు. దీనిపై తొండూరు ఎస్ఐ లక్ష్మీనారాయణను వివరణ కోరగా.. ప్రచారానికి మొదట మా వీధికి రావాలి అంటే కాదు మావీధికి రావాలని పట్టుబట్టారని.. ఎవరూ గొడవ పడలేదని అన్నారు.

శిల్పారామంలో అలరించిన నృత్యం


ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో నృత్యం చేస్తున్న మానస నృత్య బృందం

పులివెందుల టౌన్, ఏప్రిల్ 28: డాక్టర్ వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో ధర్మవరంకు చెందిన మానస నృత్య కళాకేంద్రం బృందం శాస్త్రీయ, సినిమా పాటలకు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. కుర్చీ మడతపెట్టి, పల్సర్ బైక్, డీజే టిల్లు, బృందావనం నుంచి కృష్ణుడు వచ్చాడే, సుకులాడి సిత్తమ్మి, సారంగ దరియ, గాంధారి తదితర పాటలకు బృందం చేసిన నృత్యంతో సందర్శకులు చప్పట్లు, ఈలలతో ప్రోత్సహించారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 28: మన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగర పంచాయతీ పరిధిలోని మీరాపురం, కొప్పూరు, అక్కంపేట తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమలాపురం మేజరు పంచాయతీగా ఉండేదని, నగర పంచాయతీగా మార్చాలంటే దాదాపు 20వేల జనాభా ఉండాలని, జనాభా తక్కువగా ఉన్నా వైసీపీ పాలకులు నగర పంచాయతీగా మార్చి ప్రజలను ఉపాధి పనులకు దూరం చేశారన్నారు. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టోలోని పథకాల గురించి వివరించారు. అనంతరం పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తెలుగుయువత మాజీ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, జంపాల నరసింహారెడ్డి, మండల కన్వీనరు రాఘవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, వాసుదేవరెడ్డి, ఎల్లారెడ్డి, బోయిళ్ల శంకర్‌రెడ్డి, రామమునిరెడ్డి, వేణుగోపాలరెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, దాది రామయ్య, కరీముల్లా, శంకర్‌యాదవ్, రవిశంకర్ యాదవ్, నబీరసూల్, బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ఓటమి భయంతో అప్రజాస్వామిక దాడులు

ఓటమి భయంతోనే టీడీపీ కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారని, దాడి చేస్తే ప్రతిఘటిస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని కోగటం గ్రామంలో శనివారం సాయంత్రం కళ్లల్లో కారం కొట్టి కత్తులతో బెదిరిస్తూ ఒక భయానక వాతావరణం సృష్టించేందుకు మోపూరి యల్లారెడ్డిపై అతని భార్య లతాపై దాడి చేయడం పిరికిపంద చర్య అన్నారు. టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి అనుచరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరశివా కుమారుడు అనిల్‌కుమార్‌రెడ్డి, మేనల్లుడు కరుణ్‌రెడ్డి వారి అనుచరులు స్కార్పియో వాహనంలో వచ్చి దాడులు చేయడం దుర్మార్గమన్నారు. ఇటువంటివి మానుకోవాలన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల తీర్పు కోరుకుంటున్నామని పుత్తా చైతన్యరెడ్డి అన్నారు.

వైసీపీ నుంచి 15 కుటుంబాలు టీడీపీలో చేరిక

నగర పంచాయతీ పరిధిలోని కొప్పూరువారిపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సమక్షంలో కుప్పూరు విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక

పెండ్లిమర్రి, ఏప్రిల్ 28: మండలంలోని కందూరు, తుమ్మలూరు గ్రామాలలో ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, పుత్తా లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో ఈశ్వర్‌రెడ్డి, అహమ్మద్ బాబావల్లి సమక్షంలో 15, తుమ్మలూరులో 10 కుటుంబాలవారు వైసీపీని టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎక్కడా అభివృద్ధి జరిగింది లేదన్నారు. అనంతరం చెర్లోపల్లె, కొత్తసంగటిపల్లె, మాచునూరు, పెండ్లిమర్రి పంచాయతీల నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, టీడీపీ నేతలు రాజగోపాల్‌రెడ్డి, నాగసుబ్బయ్య, సుబ్బరామిరెడ్డి, సత్యమారెడ్డి, రమణారెడ్డి, సుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రఘు, ఆరవేటి చంద్రారెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారంలో పుత్తా చైతన్యరెడ్డి

బీసీ కాలనీలో జిల్లా కార్యదర్శి ముండ్ల శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ సంక్షేమ పథకాలు వివరించారు.


కమలాపురంలో పార్టీలో చేరిన వారితో పుత్తా చైతన్యరెడ్డి

పుల్లారెడ్డిపేటలో ప్రచారం

మండల పరిధిలోని పుల్లారెడ్డిపేటలో ఇందిరెడ్డి తిమ్మారెడ్డి నేతృత్వంలో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోకి రాగానే పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతరం టీటీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్: టీడీపీ

చెన్నూరు, ఏప్రిల్ 28: దళిత ద్రోహి జగన్ అని టీడీపీ మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. చెన్నూరు కొత్తగాంధీనగర్, బుడ్డాయపల్లెలో ఆదివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. వైసీపీని నమ్మవద్దు, టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. అలాగే ఓబులంపల్లె


పెండ్లిమర్రి మండలం కొండూరు గ్రామంలో పార్టీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి

సంక్షేమాన్ని చూసి ఆదరించండి

- ఇంటింటి ప్రచారంలో పుత్తా కుటుంబీకులు

వల్లూరు, ఏప్రిల్ 28: గత టీడీపీ హయాంలో అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి క్రిష్ణచైతన్యరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని పుత్తా నరసింహారెడ్డి భార్య సరళమ్మ, కోడళ్లు చైతన్యరెడ్డి, శ్రీలక్ష్మి, డాక్టర్ దివ్యశ్రీ, సాయినరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇంటింటి ప్రచారం మండల పరిధిలోని లేబాక గ్రామ పంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వం అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. ఓటర్లు తమ ఓటును సైకిలు గుర్తుపై వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వీరి వెంట ఇందిరెడ్డి తిమ్మారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, పుత్తా రామ చంద్రరెడ్డి సుబ్బారెడ్డి, వై.సుబ్బరామిరెడ్డి, రామచంద్రరెడ్డి, సి.హరినాధరెడ్డి, ఎస్.సుబ్బిరెడ్డి, ఆర్.బాలిరెడ్డి. సి.వెంకటసుబ్బారెడ్డి, ఓబుల్‌రెడ్డి, రవీంద్రనాదరెడ్డి, రాఘవరెడ్డి, వీరారెడ్డి, పుల్లారెడ్డి, మైనార్టీ నేతలు, పుత్తా అనుచరులు వీరి వెంట ఉన్నారు.


వల్లూరులో పుత్తా కుటుంబీకులకు స్వాగతం పలుకుతున్న ప్రజలు


దాడికి గురైన టీడీపీ వాహనం

టీడీపీ వాహనంపై వైసీపీ నేతల దాడి

కడప(ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 28: కడప నగరం మూడో డివిజన్ రామాంజనేయపురంలో ఆదివారం సాయంత్రం టీడీపీ ప్రచార వాహనంపై వైసీపీ నాయకులు రాళ్లదాడి చేశారు. ఈ విషయంపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకుడు అమీర్‌బాబు మాట్లాడుతూ వైసీపీ నాయకుడు చంద్రు అనే వ్యక్తి టీడీపీ వాహన డ్రైవర్‌పై దాడి చేయబోయి రాళ్లు రువ్వడంతో వాహనం అద్దం పగిలిందన్నారు. ఓర్వలేక అక్కసుతో, ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో ఈ అఘాయిత్యానికి తెగబడ్డారన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతతో కడప ఎమ్మెల్యే మూడో స్థానానికి దిగజారడం ఖాయమన్నారు. రిమ్స్ పోలీసులు వచ్చి ఆ వాహనాన్ని, డ్రైవర్‌ను, దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప(క్రైం), ఏప్రిల్ 28: రిమ్స్ పోలీసుస్టేషన్‌లో డిస్ట్రిక్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కె.సునీల్‌కుమార్ (పీసీ 3347)ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సిద్ధార్థకౌశల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్ విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి కావడంతో ఎస్పీ సస్పెన్షన్ వేటు వేశారు. ఇదే రీతిలో శనివారం సింహాద్రిపురం కానిస్టేబుల్‌ను కూడా సస్పెన్షన్ చేశారు.

వైభవంగా మారెమ్మతల్లి జాతర

● భక్తి శ్రద్ధలతో నిండుకుండ బోనాలు

● బండలాగుడు పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ యువనాయకుడు మన్‌మోహన్‌రెడ్డి

కడప(కల్చరల్), ఏప్రిల్ 28: కడప నగర 49వ డివిజన్ పరిధి ఆలంఖాన్‌పల్లెలో ఆదివారం మారెమ్మతల్లి జాతర మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. గ్రామంలో ఆలయం నిర్మించి 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న దృష్ట్యా 20వ వార్షికోత్సవ జాతర మహోత్సవాన్ని ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారకముందే మహిళా భక్తులు నిండు కుండ బోణాలతో అమ్మవారి ఆలయ సన్నిధికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ యువ నాయకులు జి.మన్‌మోహన్‌రెడ్డి, ఆర్.జయరామిరెడ్డి, తదితరులు అమ్మవారి సేవలో తరించారు. జాతర సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం కనిపించింది. ప్రజలు అమ్మవారికి జంతుబలులు సమర్పించారు. మధ్యాహ్నం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వృషభాలచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తదనంతరం సాయంత్రం బత్తల శివ బృందం వారిచే నిర్వహించిన కోలాటం చెక్కభజన గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న జయరామిరెడ్డి

ఆలస్యంగా బిల్లుల చెల్లింపులు

● ఆగిన అభివృద్ధి పనులు

● ముందుకు సాగని ఆటలు

● ప్రభుత్వ తీరుకు నిదర్శనంగా పునాదులు

కడప (ఎన్టీఆర్‌సర్కిల్), ఏప్రిల్ 28: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే మానసిక ఉల్లాసం అవసరం. అది క్రీడల వల్లనే సాధ్యం. ఈ అంశాన్ని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరినీ ఆరోగ్యంగా ఉంచాలనే ఆలోచనతో ఆడదాం ఆంధ్ర అనే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైసీపీ పాలకులు గొప్పలు చెప్పుకొచ్చారు. ఊరూరా క్రీడ పోటీల పేరుతో నానా యాగీ చేశారు. కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి ప్రభుత్వం ఇచ్చేటువంటి ప్రైజ్‌మనీ కాకుండా తన సొంత నిధులు కూడా ఇచ్చి క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ప్రకటించి.. తరువాత సొంత నిధులు ఇవ్వకపోడంపై క్రీడాకారుల నుంచి నిరసనకు దిగిన సంఘటన చోటు చేసుకుంది. ఇక శాశ్వతంగా క్రీడా అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరు పరిశీలిస్తే... పేరు గొప్ప ఊరు దిబ్బగా ఉన్నాయి. ఈ ప్రభుత్వ హయాంలో సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో క్రీడాభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయిన పరిస్థితి నెలకొంది.

ఆగిన అభివృద్ధి పనులు


కమలాపురంలో అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం


పోరుమామిళ్లలో పునాదులకే పరిమితమైన ఇండోర్ స్టేడియం

ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు పనులను నిలిపివేశారు. దీంతో అభివృద్ధి పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. జిల్లా కేంద్రంలో రూ.2కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన క్రీడా వికాస కేంద్రం పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇక్కడ భవన నిర్మాణం పనులు శ్లాబ్ లెవెల్ వరకు పూర్తయ్యాయి. కాంట్రాక్టరుకు పార్ట్ బిల్లు ఆలస్యంగా చెల్లించడంతో పనులు నిలిపివేశారు. జిల్లా కేంద్రం తరువాత అతి పెద్ద పట్టణం ప్రొద్దుటూరు ఇక్కడ కూడా రూ.2కోట్ల అంచనాలతో క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు 33.19 లక్షల రూపాయలు మాత్రమే ఖర్చు చేసినట్లు తెలుస్తుంది. భవన నిర్మాణ పనులు స్లాబ్ వరకు వచ్చాయి. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు పనులు నిలిపివేశారు. అదే విధంగా బద్వేలు నియోజకవర్గం పరిధిలోని పోరుమామిళ్లలో రూ.2కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన క్రీడా వికాస కేంద్ర నిర్మాణ పనులు పునాదులకే పరిమిత మయ్యాయి. 20.74 లక్షల రూపాయలు మాత్రమే ఇక్కడ ఖర్చు చేశారు. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులను ఆపివేశారు. రూ.2కోట్ల అంచనాతో ఏర్పాటు చేసిన క్రీడా వికాస కేంద్రం నిర్మాణ పనులు కూడా ఆగిపోయాయి. ఇక్కడ ఇప్పటి వరకు 96.83 లక్షలు ఖర్చు చేశారు. కాంట్రాక్టరుకు పార్ట్ బిల్లు ఆలస్యంగా ఇవ్వడం వల్ల పనులు నిలిపివేశారు. జమ్మలమడుగు నియోజకవర్గ కేంద్రంలో రూ.2కోట్ల అంచనాతో చేపట్టిన క్రీడా వికాస కేంద్ర నిర్మాణ పనులు పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోలేదు. ఇక ఎస్సీ కాంపోనెంట్ ప్లాను పనులు కూడా అంతంత మాత్రంగా సాగుతున్నాయి. జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 11 చోట్ల క్రీడా మైదాన పనులు 14.50 కోట్ల అంచనాతో రూపొందించారు. ఈ పనులను ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించారు. అయితే ఇందులో రూ.3 కోట్ల అంచనాలతో ఆరు పనులు పూర్తి చేయగా, ఇప్పటికే ఐదు పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

శిక్షణా శిబిరాలు ప్రశ్నార్థకమే..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టవలసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు కూడా నిర్వహించడం ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారా లేదా అనేది అనుమానంగా ఉంది. నిబంధనల ప్రకారం మే 1వ తేదీ నుంచి జూన్ 5 వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడాఅంశాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమం ఉంటుందా, లేదా అనేది కూడా అధికారులకు ఇప్పటికీ స్పష్టత లేదు.

సంఘ సంస్కరణ దిశగా తాళ్లపూరివారి నాటకాలు

● ప్రొఫెసరు మూలమల్లిఖార్జునరెడ్డి

కడప(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 28: వందసంవత్సరాల క్రితమే నాటి సమాజాన్ని సంస్కరించే సాంఘిక నాటకాలు రాసి తాళ్లపూరి నారాయణరావు సంఘ సంస్కర్తగా కీర్తింపబడ్డాడని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ప్రొఫెసరు మూలమల్లిఖార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో తాళ్లకూరి వారి 154వ జయంతి నిర్వహించారు. ముందుగా నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేశ్య వృత్తిని నిరసిస్తూ ఆయన రాసిన చింతామణి నాటకం కొన్ని వేల సార్లు ప్రదర్శించబడి ప్రేక్షకాదరణ పొందిందన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి, దేవకళ సత్యనారాయణ మాట్లాడుతూ కలుకూరి వారు మద్యపానం వల్ల జరిగే అనర్థాలను మధుసేవ నాటకం ద్వారా వరకట్నం వల్ల ఎదుర్కొనే ఇబ్బందులను వరవిక్రయం నాటకం ద్వారా తెలియజేశారన్నారు. కార్యక్రమంలో లింగయ్య, శ్రీనివాసరాజు, ఓబులేసు, బాల ఓబయ్యను సత్కరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వల్లూరు, ఏప్రిల్ 28: కడప - తాడిపత్రి హైవే వల్లూరు మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె వద్ద రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ప్రొద్దుటూరు ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన అరుణ్‌కుమార్ తన ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. పోలీసులు ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయంపై దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడపకు తరలించామని పోలీసులు తెలిపారు.

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు


చాపాడులో పనిచేయని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

● నిధులు విడుదల చేయని ప్రభుత్వం

● వానపాములు కొనలేక.. సేంద్రియ ఎరువులు తయారు కాని వైనం

● జీతాల్లేక చెత్తను తరలించని క్లాప్ మిత్రలు

చాపాడు, ఏప్రిల్ 28: చాపాడు మండలంలో పలు గ్రామాల వద్ద నిర్మించిన చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు నిరుపయోగంగా పడిఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీల ఆదాయం పెంచేందుకు ఈ కేంద్రాలను నిర్మించాయి. చాపాడు, లక్ష్మిపేట, వెదురూరు, సోమాపురం, పల్లవోలు, ఖాదర్‌పల్లె, అన్నవరం, మరో 15 గ్రామ పంచాయతీల్లో కేంద్రాలను నిర్మించారు. ఈ కేంద్రాల వద్ద కసువు వేసుకునేందుకు సిమెంటు తొట్లు కూడా నిర్మించారు. గ్రామాల్లో లభించే వ్యర్థపదార్థాలు అయిన కసువు, కాగితాలు, వరిగడ్డి వంటివాటితో సేంద్రియ ఎరువులు తయారు చేయాలనే లక్ష్యంతో ఈ కేంద్రాలను నెలకొల్పారు. ఈ సిమెంటు తొట్లలో వానపాములను వదిలి ఈ వ్యర్థాలతో సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించాల్సి ఉంది. ఈ సేంద్రియ ఎరువులు రైతులు పసుపు, పూలతోటలు, వేరుశనగ, పండ్ల తోటలకు వినియోగిస్తే పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. ఇలాంటి మంచి ఉద్దేశ్యంతో ఈ కేంద్రాలను నిర్మించారు.

ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులు వానపాములను కొనుగోలు చేయలేకపోతున్నారు. లక్ష్మిపేట, పల్లవోలు గ్రామాల్లోని కేంద్రాల్లో మాత్రమే వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారు. ఈ కేంద్రాలు కూడా నాలుగు నెలల నుంచి మూతపడ్డాయి. క్లాప్ మిత్రలకు జీతాలు సక్రమంగా ఇవ్వడంలేదు. సుమారు రెండేళ్లపాటు జీతాలు ఇవ్వకపోడంతో క్లాప్‌మిత్రలు పనిచేసేందుకు ఆసక్తి చూపడంలేదు. దీంతో ఈ పథకం లక్ష్యం నెరవేరలేదు. ఒక్కొక్క కేంద్రాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలతో నిర్మించారు. ప్రతి గ్రామంలో సిమెంటు తొట్లు కూడా ఏర్పాటు చేశారు. ఇళ్లల్లోని కసువు ఈ తొట్లలో నింపుతున్నారు. ఈ కసువును క్లాప్ మిత్రలు కేంద్రాలకు చేర్చడం లేదు. జీతాలు సక్రమంగా రానందున వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి కసువు వేసుకునేందుకు డస్ట్‌బిన్‌లు సరఫరా చేసింది. కానీ అధికారులు ఈ డస్ట్‌బిన్‌లను ఇంకా కొన్ని గ్రామాలకు పంపిణీ చేయలేదు. నాలుగేళ్లుగా ఈ కేంద్రాలను జిల్లా అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఇవి నామమాత్రంగా పడి ఉన్నాయి. గ్రామాలు పరిశుభ్రంగా కూడా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ కేంద్రాలు పనిచేయకపోవడంతో గ్రామాలు అపరిశుభ్రంగా మారాయి.. ఇప్పటికైనా జిల్లా అధికారులు నిధులు విడుదల చేసి కేంద్రాలు పనిచేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఖాళీగా ఉన్న సిమెంటు తొట్లు

జన కేతనం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

1962 నుంచీ రైల్వేకోడూరు ఎస్సీ నియోజకవర్గం అయినా...

అగ్రవర్ణాలదే రాజ్యం

మొదటి ఎమ్మెల్యే పంజం నరసింహారెడ్డి ● కీలుబొమ్మల్లా దళిత ఎమ్మెల్యేలు ● ఇదీ నియోజకవర్గం తీరు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 28: ఆది నుంచి రైల్వేకోడూరు ఎస్సీ నియోజకవర్గంగా ఉంది. పేరుకే ఎస్సీ నియోజకవర్గం. మొత్తం పెత్తనమంతా అగ్రవర్ణాల చేతిలో ఉంటోంది. దళిత ఎమ్మెల్యేలు కీలు బొమ్మలుగా ఉంటున్నారు. రాజంపేట-రైల్వేకోడూరు సంయుక్తంగా ఓసీ నియోజకవర్గంగా ఉండేది. నాడు అనంతరాజుపేట పంచాయితీ వాసి పంజం నరసింహారెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన నిస్వార్థ రాజకీయాలు చేశారని సీనియర్ సిటిజన్లు వివరిస్తుంటారు. వీరి కుటుంబం పేదలకు భూదానం చేశారు. పంజం కుంటుంబీకులు కొన్ని వందల ఎకరాలను ఉద్యాన పరిశోధన స్థానం కోసం భూములు ఇచ్చారు. ప్రస్తుతం అనంతరాజుపేటలో ఉద్యాన పరిశోధనాస్థానం, ఉద్యాన యూనివర్సిటీ ఉంది. రైతులకు ఎంతో ఉపయుక్తంగా మారింది. పంజం నరసింహారెడ్డి వాడిన కుర్చీ, ల్యాంపు, గడియారం తదితరాలను నేటికీ వారి కుటుంబ సభ్యులు భద్రపరిచి ఉన్నారు. తర్వాత రాను, రాను దళితులు, గిరిజనుల ఓటు శాతం పెరగడంతో 1962 నుంచి రైల్వేకోడూరు ఎస్సీ నియోజకవర్గంగా ఏర్పడింది. 1962 నుంచి 1967 వరకు నిడిగంటి పెంచలయ్య, 1972లో గుంటి శ్రీరాములు, 1978లో నిడిగంటి వెంకటసుబ్బయ్య ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983 నుంచి 1999 వరకు టీడీపీ విజయపథంలో నడిచింది. 1983లో శెట్టిపల్లె శ్రీనివాసులు, 1985 నుంచి 1989 వరకు తూమాటి పెంచలయ్య, 1994లో వడ్డి చెన్నయ్య, 1999లో సోమినేని సరస్వతి విజయం సాధించారు. మహిళల కోటాలో చంద్రబాబు నాయుడు ఆమెకు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి పదవి ఇచ్చారు. 2004లో గుంటి వెంకటేశ్వరప్రసాద్, 2009లో కొరముట్ల శ్రీనివాసులు గెలుపొందారు. తర్వాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మృతి చెందడంతో వైఎస్ జగన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన వైసీపీలోకి కొరముట్ల శ్రీనివాసులు మారారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో 2012, 2014, 2019లో ఆయనే వరుసగా గెలుపొందారు. ప్రస్తుతం ఐదో పర్యాయం పోటీ చేస్తున్నారు. పేరుకే దళిత ఎమ్మెల్యేలు ఎన్నికలకు పెట్టుబడి పెడుతున్నారు కాబట్టి పెత్తనం మొత్తం అగ్రవర్ణాల చేతిలోనే ఉండిపోయింది. ఫలితంగా దళిత ఎమ్మెల్యేలు అగ్రవర్ణాల చేతుల్లో పావులవుతున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపిక మొదలు డబ్బు పెట్టుబడి వరకు అగ్రవర్ణాల నేతలే చూసుకుంటున్నారు. దళిత ఎమ్మెల్యేలు ప్రచారానికి మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. రైల్వేకోడూరు ఎస్సీ నియోజకవర్గం అయినా జిల్లాలో ప్రధాన భూమికగా ఉంటోంది. గతంలో నేతలు నిస్వార్థంగా పని చేసినా ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. గతంలో ఎన్నికలు చాలా సులభంగా, సాఫీగా, డబ్బుతో ముడి పడకుండా రాజకీయాలు చేసే వారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితులు కనిపించడం లేదు. కేవలం డబ్బుతోనే రాజకీయాలు నడుస్తున్నాయి. గత రోజుల్లో ప్రచారానికి వెళితే ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. ప్రస్తుత రోజుల్లో డబ్బు పెట్టి ప్రచారాలు చేయించుకునే పరిస్థితి ఏర్పడిందని రాజకీయ వేధావులు చెబుతున్నారు. నాడు ఎన్నికల్లో అభ్యర్థి, పలువురు నేతలు ప్రచారాలు చేసే వారు. ప్రస్తుతం హంగు ఆర్భాటాలతో కుటుంబంలో ఎంత మంది ఉంటే అందరూ ప్రచారాలు సాగిస్తున్నారు. నాడు ప్రజా సేవ కోసం రాజకీయాల్లోకి నాయకులు వచ్చే వారని మేధావులు అంటున్నారు.



అప్పటి అసెంబ్లీ ఆవరణలో తోటి ఎమ్మెల్యేలతో పంజం నరసింహారెడ్డి







అప్పటి ఎమ్మెల్యే పంజం నరసింహారెడ్డి వినియోగించిన ల్యాంప్, గోడగడియారం



పంజం నరసింహారెడ్డి



గుంటి శ్రీరాములు



నిడిగంటి వెంకటసుబ్బయ్య



శెట్టిపల్లి శ్రీనివాసులు



తూమాటి పెంచలయ్య



వడ్డి చెన్నయ్య



సోమినేని సరస్వతి



గుంటి వెంకటేశ్వర ప్రసాద్

రాజంపేట-రైల్వేకోడూరు సంయుక్త నియోజకవర్గం ఎమ్మెల్యేగా పంజం నరసింహారెడ్డి		స్వతంత్ర
1962	నిడిగంటి పెంచలయ్య	స్వతంత్ర
1967	నిడిగంటి పెంచలయ్య	స్వతంత్ర
1972	గుంటి శ్రీరాములు	కాంగ్రెస్
1978	నిడిగంటి వెంకటసుబ్బయ్య	జనత
1983	శెట్టిపల్లె శ్రీనివాసులు	టీడీపీ
1985	తూమాటి పెంచలయ్య	టీడీపీ
1989	తూమాటి పెంచలయ్య	టీడీపీ
1994	వడ్డి చెన్నయ్య	టీడీపీ
1999	సోమినేని సరస్వతి	టీడీపీ
2004	గుంటి వెంకటేశ్వరప్రసాద్	కాంగ్రెస్
2009	కొరముట్ల శ్రీనివాసులు	కాంగ్రెస్
2012	కొరముట్ల శ్రీనివాసులు	కాంగ్రెస్
2014	కొరముట్ల శ్రీనివాసులు	వైసీపీ
2019	కొరముట్ల శ్రీనివాసులు	వైసీపీ

రెండుగంటల ప్రచారానికి రూ.200

పనుల్లేని కాలంలో ఊరట



చెన్నూరు, ఏప్రిల్ 28: ఎన్నికల ప్రచారాల కాలం కొందరికి చిన్నపాటి ఉపాధినిస్తోంది. 2గంటలు ప్రచారానికి వస్తే రూ.200 ఇస్తామంటూ ప్రధాన పార్టీలన్నీ వారి వారి అనుచరులకు పురమాయించి ఖాళీగా ఉన్న జనాలను రప్పించుకుంటున్నారు. ప్రచారానికి వస్తే వేసవి కాలం కాబట్టి సాయంత్రం 2గంటలు వచ్చి మాతో తిరగండి, మీరు చేయాల్సిందేమీ లేదు. మావద్దఉంది అర్థబలం మా వెనుక అంగబలం ఉన్నట్లు చూపించుకునేందుకే. మా అనుచరులు తీసుకువస్తారు, ఏదో ఈ రెండుగంటలు అలా గడిచిపోతుంది. మా వెనుక ఇంత మంది ఉన్నారని చెప్పుకునే విధంగా చెన్నూరులో ప్రచారం సాగుతోంది. ఏదైతేనేం అలా రెండుగంటలు వెళితే రూ. 200 వస్తాయి కదా అని ఇంట్లో భార్య, భర్త, పిల్లలు సైతం ప్రచారానికి వెళ్లడం, ఆ పూటకు నేతలకు జై కొట్టడం, రూ.200 తెచ్చుకోవడం. ఇదీ కొద్దిరోజులుగా జరుగుతున్న తంతు. ఈవేసవిలో రబీ సీజను కూడా పూర్తికావడం, వ్యవసాయ పనులు లేక ఎండలకు ఉపాధి పనులకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్న వారికి ఇదొక అవకాశం. దీంతో రోజూ ఎవరు పిలుస్తారా అని ఎదురు చూడడం జరుగుతోంది. పైగా పార్టీలకు జనాలను సమీకరించుకునేందుకు మండలంలో ప్రతి ప్రాంతంలో కొందరు నేతల అనుచర గణం ఉంటున్నారు. వారికి పురమాయిస్తే వారికి కూడా అంతో ఇంతో ఖర్చులకు డబ్బు ఇస్తే ఖాళీగా ఉన్న వారిని ప్రచారానికి తీసుకువస్తున్నారు. దీంతో ఒక రోజుకు ప్రచారం వస్తే ఆ పూట ఆనందంగా గడిచే పరిస్థితి ప్రస్తుతం ఉంది. దీంతో ప్రచారాలకు వచ్చేవారంతా ఎన్నికల అధికారలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఎందుకంటే గతంలో తక్కువ రోజులే ప్రచారాలకు గడువు ఉండేది. ఈ మారు ఎక్కువ రోజులు ఉండడం, మండుటెండలు పెరగడంతో ఈ ప్రచారం కడుపు నింపడానికి అవకాశంగా ఉండడంతో పేదలు సంతోషపడుతూ సాయంత్రం వేళ ప్రచార నేతలకు జై కొడుతూ తిరుగుతున్నారు.

వీరశివారెడ్డి రూటే వేరబ్బ...

మూడు నెలల్లో రెండు పార్టీల్లోకి చేరిక



(కడప - ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి రూటే వేరబ్బ అంటూ పొలిటికల్ హీట్‌లో చర్చ నడుస్తోంది. మూడునెలల్లోనే వీరశివారెడ్డి రెండు పార్టీల అధినేతల సమక్షంలోనే కండువా కప్పుకోవడం చర్చనీయాంశమైంది. వీరశివారెడ్డి కమలాపురం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019ఎన్నిక ల్లో టీడీపీలోకి వచ్చిన ఆయన కమలాపురం టికెట్ ఆశించారు. అయితే చివరి నిమిషం లో వైసీపీలోకి జంప్ అయిపోయారు. మళ్లీ ఐదేళ్ల తరువాత జనవరి చివరి వారంలో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. కమలాపురం టికెట్ కోసం ఆశించి భంగపడ్డారు. ఇటీవలే ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, టీడీపీ నేత బీద రవిచంద్ర వీరశివారెడ్డితో ప్రొద్దుటూరులో మంతనాలు జరిపారు. ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి సముచిత స్థానం కల్పిస్తే టీడీపీలో కొనసగుతామని హామీ ఇచ్చారు. అయితే 25న పులివెందుల లో సీఎం జగన్ సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. సరిగ్గా 2019లో ఇలాగే టీడీపీ నుంచి వైసీపీలోకి జంప్ అయ్యారు. ఈ సారి కూడా సేమ్‌సీన్ రిపీట్ కావడంతో ఎంతైనా వీరశివారెడ్డి రూటే వేరబ్బా అంటున్నారు.

మద్దతు మీకే.. మాకేం ఇస్తారూ... ?

● సామాజిక వర్గం నేతల డిమాండ్లు

మైదుకూరు, ఏప్రిల్ 28: సామాజిక వర్గం నేతల డిమాండ్లతో అభ్యర్థులు బేజారెత్తిపోతున్నారు. తమ వర్గం ఓట్లు వేయించాలంటే ఎంత ఇస్తారంటూ ప్రత్యర్థులు ఇరువురితోనూ బేరసారాలకు దిగుతున్నారు. అభ్యర్థుల ఆర్థిక పరిస్థితిని బట్టి 5 నుంచి రూ. 10లక్షలు, అన్ని ఖర్చులు పెట్టుకోవాలంటూ అల్టిమేటం జారీ చేస్తున్నారు. వార్డుల వారీ చేరికల పేరుతో అభ్యర్థుల నుంచి నగదు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే తమకు గౌరవం ఇవ్వడం లేదని బురద చల్లటం అనవాయితీ. వీరికి డబ్బు ఇస్తే ఓట్లు వేయించగలరా లేదా అని అభ్యర్థులు కూడా ఆరా తీస్తున్నారు. ఓట్లు రాలతాయి అనుకుంటే కొంత మొత్తం ఇచ్చేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు సిద్ధమవక తప్పడం లేదు.

గల్ఫ్ ఓట్లు గట్టెక్కించేనా ?

ఉమ్మడి జిల్లాల్లో సుమారు లక్ష మంది ప్రవాసీలు ● వలస ఓట్లపై వేట

● గల్ఫ్, బెంగళూరు, హైదరాబాద్, ఇతర ప్రాంతాలపై గురి

● వలసవాసులతో నేతల సమావేశాలు





బద్వేలుటౌన్, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికలను ప్రవాస భారతీయుల ఓట్లు గట్టెక్కిస్తాయని అంచనాలో నేతలున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు లక్షకు పైచిలుకు ప్రవాస భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో వలస ఓటర్లపై అధినేతలు దృష్టిసారించారు. ఎన్నికల గడువు దగ్గర పడుతుం డడంతో అభ్యర్థులు ఒక్కోవర్గం ఓట్లను రాబట్టుకు నే పనిలో పడ్డారు. వైసీపీ ప్రజావ్యతిరేకతే టీడీపీ, బీజేపీ, జనసేనలకు కలసి వస్తుందని ఆశిస్తున్నారు. ఇప్పటికే పలువురు ప్రథమ, ద్వితీయ శ్రేణి నేతలు ప్రవాస భారతీయులతో సమావేశాలు ఏర్పాటు చేయడం, వారిని భారత్‌కు రప్పించే పనిలో పడ్డారు. అయితే పనులు వదులుకుని వారు ఇక్కడికి వచ్చేందుకు సమ్మతిస్తారో లేదో వేచిచూడాలి మరి....

సార్వత్రిక ఎన్నికలు టీడీపీ, వైసీపీకి నువ్వానేనా అనే విధంగా మారాయి. ముఖ్యంగా బద్వేలులో టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, వైసీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే డాక్టర్ సుధకు కీలకంగా మారాయి. కూటమిలో భాగంగా పొత్తు ధర్మంలో బద్వేలు ఎమ్మెల్యే టికెట్‌ను బీజేపీ అభ్యర్థి బొజ్జా రోశన్నకు కేటాయించారు. అయితే కూటమి అభ్యర్థి బొజ్జా రోశన్న గెలుపు భారాన్ని భుజాన వేసుకున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్ కుమార్‌రెడ్డి నియోజకవర్గంలో పల్లెపల్లెకూ పాద యాత్ర చేసి ప్రజలు, నేతల్లో నయాజోష్ తెప్పించారు. బద్వేలు నియోజకవర్గ ప్రాంతంలో వర్షాలు లేనికారణంగా వ్యవసాయం దెబ్బతిని పెట్టుబడులు చేతికి అందక, పరిశ్రమలు లేక నియోజకవర్గ ప్రజలు కువైట్, సౌదీ అరేబియా, మస్కట్, దుబాయ్, హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై ఇతర ప్రాంతాలకు వలసలబాట పట్టారు. దీంతో ప్రవాసీయులను నేతలు కలుసుకుని బొజ్జా రోశన్న గెలుపు కోసం సహకరించాలని కోరారు. గల్ఫ్ దేశాల్లో ప్ర మాద వశాత్తు మరణించిన ప్రవాసీయుల మృతదేహాలను స్వగ్రామాలకు చేర్చేందుకు టీడీపీ ప్రభుత్వం చేసిన కృషితో ప్రజలకు టీడీపీ దగ్గరైంది. సార్వత్రిక ఎన్నికల సమయానికి నియోజకవర్గం నుంచి సుమారు 10వేల మంది పైనే ఓటర్లు గల్ఫ్ లోనే ఉన్నారు. వారిపై ఆధారపడిన కుటుంబా ల సంఖ్య ఎక్కువే. అందువలన వారిని, వారి కుటుంబ సభ్యుల ను బొజ్జ రోశన్న గెలుపు కోసం కృషిచేయాలని ప్రవాసీయుల ను కోరే అవకాశం ఉంది.

కలసపాడు, కాశినాయన, బద్వేలు, పోరుమామిళ్ల, బి.కోడూరు, అట్లూరు, గోపవరం మండలాలకు చెందిన పలువురు బెంగుళూరుకు వలస వెళ్లారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలే కాకుండా హోటల్ మేనేజ్‌మెంట్, కాంట్రాక్ట్, పీజీలు, కూలి పనులు చేసుకుం టూ నియోజకవర్గ వాసులు ఎక్కువ మంది అక్కడే నివశిస్తున్నారు. వారిని కలిసి బొజ్జ రోశన్న గెలుపు కోసం కృషిచేయాలని కోరుతున్నారు. ప్రధా ని నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కూడా కలిసి వస్తాయని [illegible] ఆలోచిస్తోంది. అన్ని ప్రధాన పార్టీలకు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారగా, ప్రధాన పార్టీల అభ్యర్థులు జిల్లాలో ప్రవాసీల ఓట్లపైనే ఆశలు పెంచుకుంటున్నారు.

గల్ఫ్‌లో భారీగా...

ఉమ్మడి జిల్లా నుంచి గల్ఫ్‌కు వెళ్లిన వారి సంఖ్య లక్షమందికి పైగానే ఉంటుంది. రాష్ట్రంలో, ఉమ్మడి జిల్లా నుంచి ఉపాధి నిమిత్తం భారీగా దాదాపు మూడు దశాబ్దాలకు ముందే ఈ ప్రాంతీయులు గల్ఫ్‌కు వెళ్లారు. ప్రధానంగా కడప, బద్వేలు, రాజంపేట, రైల్వేకోడూరు, ఒంటిమిట్ట, భాకరాపేట, ప్రొద్దుటూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, కమలా పురం తదిదర నియోజకవర్గాల నుంచి ఎక్కువగా గల్ఫ్ దేశాలైన మస్కట్, దుబాయ్, కువైట్, సౌదీ అరేబియా, కత్తర్ దేశాలకు వలసవెళ్లారు. ఒక్కో నియోజకవర్గం నుంచి సుమారు 10వేల మం ది ఓటర్లు గల్ఫ్‌లోనే ఉన్నారు. అనేక ఏళ్లగా అక్కడ ఉన్నప్పటికీ సార్వత్రిక ఎన్నికల సమయానికి అక్కడ ఉన్న ప్రవాసీయులు ఇక్కడికి వచ్చి ఓటు వేస్తుంటారు.

మొగ్గు ఎవరివైపో

ఉమ్మడి జిల్లాలో గల్ఫ్ కుటుంబాల సభ్యులు అభ్య ర్థుల గెలుపోటములను శాసించే అవకాశం ఉంది. దీంతో అన్ని ప్రధాన రాజకీయపార్టీలు గల్ఫ్ జపం చేస్తున్నాయి. గల్ఫ్ బాధితులను ఆదుకుంటామని హామీలను ఇస్తున్నాయి. అయితే గల్ఫ్ ఓటర్లలో మొగ్గు ఎవరికి ఉంటుందనేది అన్ని నియోజక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గల్ఫ్‌లో ఉన్న వారిని కలసుకుని వారి ఓట్లను అభ్యర్థించడంతో వారి కుటుంబసభ్యుల ద్వారా తమకే ఓట్లు వేయా లని నేతలు కోరారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రవాసీయుల ఓట్లు కీలకంగా మారనున్నాయి.

ఎంసీసీ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయండి

జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు బానుదాస్ పాలవె

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కు సంబంధించి ఓటర్లను మభ్యపెట్టే చర్యలు, ఎంసీసీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన అంశాలపై వెంటనే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు బానుదాస్ పాలవె తెలిపారు. బద్వేలు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాల్లో పర్యవేక్షణ నిమిత్తం జిల్లాకు చేరుకున్న ఆయన ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలోని ఎఫ్-3లో రోజూ ఉదయం 8-30 గంటల నుంచి 10-30 గంటల వరకు అందుబాటులో ఉంటారని, నేరుగా కానీ,సెల్ ద్వారా 8712644924కు ఫిర్యాదు చేయాలన్నారు.

అక్కడా వారే... ఇక్కడా వారే



కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 28: ఎన్నికలు వచ్చాయంటే కొందరికి పండుగే. ఎన్నికలప్పుడు వీరు చేసే హడావుడి అంతా ఇంతా కాదు. ఆ పార్టీ, ఈ పార్టీ అనే తేడా లేకుండా అన్ని చోట్ల వీరే కనిపిస్తుంటారు. ఎక్కడికి వెళ్లినా పాదరసంలా వారితో అంటుకుపోతారు. అభ్యర్థి విజయం కోసం పనిచేస్తున్నట్లు బిల్డప్ ఇస్తుంటారు. ఉదయం ఓ పార్టీ అభ్యర్థి వద్ద హడావుడి చేసి సాయంత్రానికి మరో పార్టీ వద్ద అదే హడావుడి చేస్తారు. ఇలాంటివి రాజకీయాల్లో సహజమే. కానీ గతంలో అలాంటి వారిని ఇట్టే కనిపెట్టేసేవారు. ఎందుకంటే వారి సంఖ్య చాలా పరిమితంగా ఉండేది. ఈ సారి కడప నియోజకవర్గంలో వీరి సందడి ఎక్కువగా కనిపిస్తోంది. టీడీపీ అభ్యర్థి మాధవీ రెడ్డి, వైసీపీ అభ్యర్థి అంజద్‌బాషా ఇద్దరూ ప్రచారాల్లో ఇటువంటి వారు తరచూ కనిపిస్తున్నారు. దీంతో వీరి ఆటలు సాగుతున్నాయి.

జాతీయ పార్టీలకే ఈవీఎంలో తొలి ప్రాధాన్యత



కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 28: ఈవీఎంలో తొలుత గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల అభ్యర్థులకు ప్రాధాన్యతనిస్తారు. నామినేషన్ పత్రాల్లో తమ పేరు, ఇంటి పేరు నమోదు చేయడంలో ఒక్కొక్కరు ఒక్కో పద్ధతి అవలంభిస్తారు. అందుకే నామినేషన్లు ఈవీఎంలలో అభ్యర్థి పేరు ఎలా ఉండాలని కోరుకుంటారో ప్రత్యేకంగా రాసి ఇవ్వాలని అధికారులు సూచిస్తారు. దాని ఆదారంగా ఈవీఎంలో సదరు అభ్యర్థికి చోటు కేటాయింపునకు చర్యలు తీసుకుం టారు. అభ్యర్థుల ప్రాధాన్యతక్రమాన్ని నిర్ధారించేందుకు అధికారులకు ఇదే ఆధారం. ప్రాధాన్యతక్రమాన్ని నిర్ధారించేందుకు మొదట జాతీయ పార్టీల అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తారు. వారు ఇచ్చిన పేర్లలో మొదటి అక్షరాలను పరిశీలించి తెలుగు వర్ణమాలలోని అక్షరాలు, గుణింతాలు ఆధారంగా వరుస క్రమాన్ని నిర్ధారిస్తారు. జతీయ పార్టీల అభ్యర్థులను గుర్తించి వారికి వరుస నెంబరు కేటాయించిన తరువాత గుర్తింపు పొందిన రాష్ట్రపార్టీ అభ్యర్థులను నమోదు చేస్తారు. ఒకటి కన్నా ఎక్కువ రాష్ట్ర పార్టీ అభ్యర్థులుంటే వారు ఇచ్చిన పేరు వివరాల ఆధారంగా తెలుగు వర్ణమాలను అనుసరించి వరుసలో కేటాయిస్తారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 28:సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగ, ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించిందని ఎన్నికల డీటీ జగదీష్ పేర్కొన్నారు. ఈనెల 26వరకు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. అయితే వివిధ కారణాలు, కొంత గందరగోళం నెలకొన్న నేపథ్యంలో చాలా మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోలేకపోయారు. దీంతో దరఖాస్తు గడువును మే 1 వరకు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో పనిచేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని, ఇతర జిల్లాల్లో పనిచేసే వారికి ఉండదని డీటీ పేర్కొన్నారు. జిల్లాలో కాని, నియోజకవర్గాల్లో అయిన ఎవరైనా పోస్టల్ బ్యాలెట్‌కు ఫారం-12 దరఖాస్తు చేసుకోని వారు పనిచేసే నియోజకవర్గాల ఆర్వోలకు దరఖాస్తు అందజేయాలని ఆయన తెలిపారు.

ప్రచారం కొత్త పుంతలు



కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 28: ఒకప్పుడు ఎన్నికలు వస్తే ఒకటే హవా ఉండేది. ప్రచార పద్ధతులు కూడా విలక్షణంగా ఉండేది. గోడల మీద పెద్దపెద్ద అక్షరాలతో అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు రాయించే వారు. వీధివీధినా పార్టీ కార్యాలయాలు వెలిసేవి. జెండాలతో ఊరూ వాడా నిండిపోయేది. రిక్షాల్లో ప్రచార హోరు అబ్బో. మామూలుగా ఉండేది కాదు. ఇప్పుడు అవన్నీ కనుమరుగయ్యాయి. ఎన్నికల సంస్కరణలు, సోషల్ మీడియా విస్తృతంగా విస్త రించిన నేటి కాలంలో ఎన్నికల ప్రచారంతో నయా ట్రెండ్ నడుస్తోంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు వచ్చాయంటే చాలు పల్లెలు, పట్టణాల్లో రాజకీయ పార్టీల జెండాలు, గోడ మీద రాతలు, బ్యానర్లు అబ్బో- ఒకటే సందడి. పార్టీ కార్యాలయాల వద్ద ఎంతో హడావుడి కనిపించేది. పెయింటర్లు జెండాలు తయారు చేసేవారికి చేతి నిండా పని. జేబునిండా డబ్బు వచ్చేది. జేబులకు పెట్టుకునే కాగితంతో తయారు చేసిన ప్రధాన పార్టీల గుర్తులు ముద్రించి బ్యాడ్జిలను కార్యకర్తలకు పంపిణీ చేసేవారు. రెండు మూడు ఎన్నికల నుంచి పాత కాలం నాటి జెండాలు, బ్యానర్లు గోడలపై పార్టీల అభ్యర్థుల పేర్లు ఎక్కువగా కనిపించడంలేదు. మారిన కాలానికి ఎన్నికల సంస్కరణలు తోడవడంతో బహిరంగ ప్రచారంపై కొద్దిపాటి నిషేధం నెలకొంది. అయితే ఇప్పుడు అంతా హైటెక్ ప్రచారం. సోషల్ మీడియా యుగం కావడంతో అభ్యర్థులు ఎక్కువగా ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోను ఉండడంతో వాయిస్ మెజేస్‌ల ట్రెండ్ వచ్చింది. వాట్సాప్ ఛానెల్, ఇప్పుడు ఫోన్ కాల్స్ చేసి ఫోన్సు చేసి మరీ ఓట్లు అడుగుతున్నారు. అభ్యర్థుల వీడియోలు మెసేజ్‌లతో ఫోన్ కాల్స్ నిండిపోతున్నా యి. దీంతో ఓటర్లు ఎవరూ ఫోను కాల్స్ రిసీవ్ చేయాలో తెలియని పరిస్థితుల్లో ఉంటున్నారు.

టీడీపీతోనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు



వరద సమక్షంలో టీడీపీలో చేరిన అమృతనగర్ వైసీపీ కార్యకర్తలు, 3వవార్డు ప్రచారంలో పాల్గొన్న వరద కుమార్తెలు, భూపేశ్ సతీమణి

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 28 : మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ అమృతనగర్‌లో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీలోచేరాయి.వీరికి మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, మీఎస్ ముక్తియార్,ఈవీ సుధాకర్ రెడ్డి,చల్లా రాజగోపాల్ యాదవ్,నల్లబోతుల నాగరాజు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు నెలకు 1500 ఆర్థిక భృతి..: టీడీపీ అధికారంలోకి వస్తే 18 ఏళ్ళు నిండిన ఆడబిడ్డలకు నెలకు 1500 వందలు వంతున ఆర్థిక భృతి అందిస్తారని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కుమార్తెలు అనురాధ, అరుణ, కోడలు మీనా, భూపేష్‌రెడ్డి సతీమణి జ్యోతి తెలిపారు. ఆదివారం స్థానిక 3 వవార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులైన నంద్యాల వరదరాజులరెడ్డి, చదిపిరాళ్ళ భూపేష్‌రెడ్డిని సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 3 వవార్డు కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మీ, జంబాపురం రామాంజనేయులరెడ్డి, వాహిదా, జహరాబీ, గుర్రమ్మ,మాబూచాన్, విజయలక్ష్మీ, లక్ష్మణ్‌యాదవ్, చీమల రాజశేఖర్‌రెడ్డి, బోగాల లక్ష్మీనారాయణమ్మ, శైలజ లక్ష్మీ పాల్గొన్నారు.



నంద్యాల కొండారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన ఏఐటీయూసీ నేతలు

బలిజల న్యాయమైన హక్కులను పరిరక్షిస్తాం : వరద



ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 28 : బలిజల న్యాయమైన హక్కులను టీడీపీ ప్రభుత్వంలో పరిరక్షిస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి, ఎంపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక పెన్నానదీ తీరంలోని బలిజకళ్యాణమండపంలో బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.వైసీపీ ప్రభుత్వం కాపులు, బలిజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం ప్రధాన కార్యదర్శి బుక్కపట్నం జయశంకర్, ఉపాధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు,చంద్రమౌళి, కోట చంద్రశేఖర్, విజయ్,రాయని సుబ్రమణ్యం, విశ్వనాధ్,టంకశాల మురళీ, ఆకుల చంద్రశేఖర్ రాజశేఖర్,ఆసం రఘురామిరెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, ఘంటశాల సావిత్రమ్మ, కోటా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వరదరాజులరెడ్డితోనే ప్రొద్దుటూరు అభివృద్ధి..: ఎమ్మెల్యేగా నంద్యాల వరదరాజులరెడ్డిని గెలిపించుకుంటేనే ప్రొద్దుటూరు అభివృద్ధి సాధ్యమౌతుందని టీడీపీ మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ వైఎస్ జబీవుల్లా పేర్కొన్నారు. ఆదివారం 25 వవార్డు మట్టి మసీదు వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ మహ్మద్ గౌస్, ముజాహిద్దీన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం..: గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం అవుతుందని వరదరాజులరెడ్డి సోదరుడు నంద్యాల గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సోములవారిపల్లె పంచాయతీలోని ఈశ్వర్‌రెడ్డి నగర్ 9,10,11 వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీతారామిరెడ్డి, రాముడు,సుబ్బారెడ్డి, భరత్ క్రిష్టారెడ్డి, పూల ఖాజా,చిన్న అమీర్,మోహన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి,గంగాధర్,మధు, భైరవుడు పాల్గొన్నారు

ఇంటింటికి టీడీపీ సంక్షేమ పథకాలు..: ఇంటింటికి టీడీపీ సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యమని వరదరాజులరెడ్డి సోదరులు హనుమంతరెడ్డి, భార్గవరెడ్డి, ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం 22 వవార్డులో సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. మే 13 న జరిగే ఎన్నికల్లో ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా నంద్యాల వరదరాజులరెడ్డిని గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో బేపారి ఆరీఫ్, ఇనయతుల్లా, మడూరు మున్నా,ఖాదర్, ఉప్పలూరు రసూల్. జనసేన జిలాన్ పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావడం రాష్ట్రానికి అవసరం..: చంద్రబాబు సిఎం కావడం రాష్ట్రానికి ఎంతో అవసరమని ఏఐటీయూసీ ఆటో యూనియన్ కార్యదర్శి గురుస్వామి పేర్కొన్నారు. ఆదివారం టీడీపీ క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, నంద్యాల కొండారెడ్డి సమక్షంలో ఏఐటీయూసీ ఆటోయూనియన్ నేతలంతా టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన ఏఐటీయూసీనేతలు శంకర్, హుస్సేన్‌బాషా, ఫక్కీరయ్య, మున్నా, కల్లూరు ఓబయ్య, ప్రసాద్ ,మల్లెపూల శేఖర్ వున్నారు.

వరదకు మద్దతు తెలిపినవిశ్వహిందూ పరిషత్..: ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా కూటమి అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డికి విశ్వహిందూ పరిషత్ మద్దతు తెలిపింది. ఆమేరకు కామనూరులోని గోశాలలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించి వరదరాజులరెడ్డిని ఈ ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నేతలు మల్లికార్జునరావు,డాక్టర్ లక్ష్మీనరసయ్య, వంకదార వీరభద్రయ్య పాల్గొన్నారు.

వైసీపీకి ఓటమి భయం..: ప్రొద్దుటూరులో టీడీపీ టిక్కెట్టు వరదరాజులరెడ్డికి రావడంతో వైసీపీ అభ్యర్థి రాచమల్లుకు ఓటమి భయం పట్టుకుందని అందుకే ఆర్యవైశ్యులను తప్పుదోవపట్టించేందుకు వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం వాసవీ కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య లతో ఆత్మీయ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి నంద్యాల కొండారెడ్డి. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్, వంకదార వీరభద్రయ్య, మురికి నాగేశ్వరావు, జొన్నలగడ్డరవి, నాగరాజు ,రమేష్, నారాయణ,సత్యనారయణ, కామిశెట్టి బాబుతదితులు పాల్గొన్నారు.

ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తాం

మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ ● టీడీపీలోకి పెరుగుతున్న చేరికలు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 28 : మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన 120 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. బి.మఠం మండల కేంద్రంలోని ఊటుకూరు గంగిరెడ్డి, ఊటుకూరు రఘురామిరెడ్డి, ఊటుకూరు రమణారెడ్డి, వెల్లటూరు ఈశ్వర్‌రెడ్డి చౌదరివారిపల్లె ఓసీ కాలనీలో అన్నపురెడ్డిసురేంద్రరెడ్డి,లింగందిన్నెఓబులరెడ్డి, లెక్కల వెంకటశివారెడ్డి,పోలు ఈశ్వర్‌రెడ్డి, గొడ్లవీటి చంద్రోబుల్‌రెడ్డి, అంకిరెడ్డిపల్లె రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 30 కుటుంబాలు చేరాయి. చౌదరివారిపల్లె ఎస్సీ కాలనీలో నాగిపోగుదేవరాజ్, నాగిపోగు మత్తయ్య, లక్కినేని రమేష్, కత్తి యువరాజుతో 40 కుటుంబాలు , జి.నరసింహాపురం గ్రామంలో లింగాలదిన్నె పెంచల్ రెడ్డి, సానం అంగడివెంకటరెడ్డి, అంకిరెడ్డిపల్లె వెంకటసుబ్బారెడ్డి, భీమిరెడ్డి భానుప్రకాశ్‌రెడ్డి, సానం వెంకటరెడ్డి, సానం నిశికేశ్వర్‌రెడ్డి, వీరయ్య, చిన్నవీరయ్య శ్రీరాములతో పాటు 30 కుటుంబాలుతో పాటు గుండాపురం గ్రామంలో మాజీ సర్పంచ్ చెవుల వెకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అనంతరం పుట్టా మాట్లాడుతూ బి.మఠం మండలవాసిని రెండుసార్లు ఓడిపోయి ప్రజా సేవకోసమే అందుబాటులో ఉన్నానని, మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నా ప్రతి ఒక్కరూ తనకు అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మండలాన్ని ఆదర్శమండలంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రచార సమన్వయకర్త పుట్టా ఆనంద్‌యాదవ్, మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, శ్రీయపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, గోవిందాయపల్లె శ్రీరాములు, లగసాని గంగరాజు, చెవుల వెంకటేశ్వర్లు, ముడుమాల పోలిరెడ్డి, అంకిరెడ్డిపల్లె రామసుబ్బారెడ్డి, సురేంద్రరెడ్డి, ఓబులరెడ్డి, పురుషోత్తంరెడ్డి, లింగందిన్నె సిద్దారెడ్డి, శుభక్రిష్టారెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి బసిరెడ్డి పోలిరెడ్డి, నాగచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

పుట్టా సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో భారీగా చేరికలు

మైదుకూరు, ఏప్రిల్ 28 :సైకిల్ గుర్తుకు ఓట్లేసి గెలిపిస్తే వృద్ధులకు, వికలాంగులకు నెలకు 4 వేలు చొప్పున పెన్షన్ ఇస్తామని, అలాగే ఆర్టీసీ బస్సుల్లో ఆడవారు ఉచితంగా ప్రయాణం చేయవచ్చంటూ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ ముమ్మరంగా ఇంటింటి ప్రచారం చేస్తూ మరో వైపు వైసీపీ అసమ్మతి వాదులను టీడీపీలోకి చేర్చుకుంటూ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ మండల టీడీపీ నాయకులతో కలిసి ఆదివారం పలు వార్డుల్లో ప్రచారం కోసం వెళ్తే అక్కడ గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారు. ఆదివారం ఉదయం 6గంటలకే పట్టణంలోని 3వ వార్డు నానుబానుపల్లె, యల్లంపల్లె, హరిజనవాడలలో ఇంటింటి ప్రచారం శ్రీకారం చుట్టారు. సైకిల్ గుర్తుకు ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ మేరకు టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోల కరపత్రాలను పంపిణీ చేశారు.

3వ వార్డులో 20 కుటుంబాలు చేరిక..: పట్టణ పరిధిలోని 3 వార్డుకు చెందిన వైసీపీ నాయకులు మేస్త్రీ సుబ్బారెడ్డి, గోవిందు సుబ్బారెడ్డి అనుచరులకు చెందిన దాదాపు 20 కుటుంబాలవారు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు.

11వ వార్డులో 30 కుటుంబాల చేరిక..: పట్టణంలోని 11వ వార్డుకు చెందిన కటారి సుధాకర్, ఏసురత్నం, పల్లె చంద్రశేఖర్, షేక్ ఫరూక్, యాకోబ్‌లకు చెందిన దాదాపు 30 కుటుంబాల వారు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు.

30 కుటుంబాల వారు టీడీపీలోకి...: మండలంలోని తువ్వపల్లె, కట్టకిందపల్లెలో వైసీపీకి చెందిన బి కొండారెడ్డి, నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో యనమల భాస్కర్‌రెడ్డి, ఎడికట్ల బాబు సాహెబ్, చిన్న వెంకటయ్య, ప్రతాప్, ఉబ్బన్న తదితరుల దాదాపు 30 కుటుంబాల వారిని టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీరాంనగర్‌లో పలువురు వైసీపీ నాయకులు..: పట్టణంలోని శ్రీరామ్ నగర్‌లో ఆదివారం రాత్రి పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. స్థానిక వైసీపీ నాయకులు రేనాటి వెంకట సుబ్బయ్య, సుబ్బరాయుడు, కేశన్న, చిన్న నరసింహులు, హరి, నారాయణ, పుల్లయ్య, పెంచలయ్య, చెంద్రాయుడు తదితరులకు చెందిన దాదాపు 40 కుటుంబాల వారిని టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ టీడీపీ కండువాలు కప్పి టీడీపీలోకి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మైదుకూరులో 3వ వార్డులో పుట్టా ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న దృశ్యం



మైదుకూరులో11వ వార్డులో పుట్టా ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న నేతలు



బి.మఠం చౌదరివారిపల్లెలో పుట్టా సమక్షంలో టీడీపీలో చేరుతున్న ప్రజలు



మైదుకూరులో టీడీపీలో చేరిన శ్రీరామ్‌నగర్ వైసీపీ నాయకులు

వెలుగని వీధిలైట్లు

● ఇబ్బందుల్లో ప్రజలు



ముద్దనూరు రోడ్డులో వెలుగని వీధిలైట్లు

జమ్మలమడుగు, ఏప్రిల్ 28: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ముద్దనూరు రోడ్డులో ఆర్డీవో కార్యాలయం సమీపం నుంచి దిగువపట్నం కాలనీ వెళ్లే మలుపు రోడ్డు వరకు వీధిలైట్లు వెలుగక రోడ్డు అంధకారంగా మారింది. ఆదారిలో ఆర్డీవో కార్యాలయం సమీపాన మద్యంబార్ ఉంది. ఆ రోడ్డులో వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కరెంటు సమస్యకు సంబంధించి జమ్మలమడుగు పట్టణ విద్యుత్తు ఏఈ రాజబాబును 'ఆంధ్రజ్యోతి' సమస్యను తెలుపగా తాము వీధిలైట్లకు కరెంటు సరఫరా చేశామని, వీధిలైట్లు పోయినట్లు, దాన్ని మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉందని ఆయన తెలిపారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాల ప్రదానం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 28: పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనపరచిన బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆదివారం సాయంత్రం బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం, మెమెంటోలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం నాయకుడు కంబగిరిరావు , మల్లికార్జునరావు, బ్రాహ్మణ సంఘం నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజోలి ఆనకట్ట వద్ద నుంచి 30 క్యూసెక్కులు నీరు విడుదల

రాజుపాలెం, ఏప్రిల్ 28 : వర్షాలు లేక కుందూ నదిలో నీరంతా పూర్తిగా ఇంకిపోయింది. దానికి తోడు ఎండలు విపరీతంగా పెడుతుండడంతో పశువులకు తాగేందుకు చుక్కనీరు లేక కుందూ పూర్తిగా ఎండిపోయింది. దీంతో పశువులకు నీటి కోసం అధికారులు 30 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు సంబంధిత ఇరిగేషన్‌అధికారులు తెలిపారు. ఈ నీరు పాలేరు వాగు నుంచి కుందూకు తరలిస్తున్నట్లు తెలిపారు. మండువేసవిలో తాగునీటి అవసరాలకు ఈ నీరు రావడంతో చుట్టుపక్కల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

బద్వేలు, ఏప్రిల్ 28 : నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని బద్వేలు నియోజకవర్గ ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్ గురుమూర్తి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బీసీ సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ కన్వీనర్ వెంకటస్వామి, జమ్మలమడుగు నియోజకవర్గ కన్వీనర్ రెడ్డెయ్యలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13 వతేదీన జరుగు సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లు నిస్వార్థంగా పాల్గొని తమఓటుహక్కును నిజాయతీగా వినియోగించుకోవాలన్నారు. ఏడు మండలాలలో ఎక్కడైనా నియమావళికి వ్యతిరేకంగా కార్యక్రమాలు జరిగితే ఆ విషయాన్ని తక్షణమే నియోజకవర్గ ఎన్నికల అధికారులు, జిల్లా అధికారులకు లేదా నియోజకవర్గ కన్వీనర్లకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామసుబ్బయ్య, ఓఎస్‌వి. ప్రసాద్, నాగిపోగు నారాయణ, రామ్మోహన్‌రావు, మునెయ్య, గిలక మునెయ్య, చిన్నయ్య , అన్వర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 28 : రాష్ట్రంలోని బడుగు బలహీనవర్గాల అభివృద్ధే కాంగ్రెస్‌పార్టీ లక్ష్యమని మైదుకూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జిల్లా ఇన్‌చార్జ్ గుండ్లకుంట శ్రీరాములు అన్నారు. ఆదివారం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని కొత్తూరు, పాతూరు, కక్కయ్యనగర్, రవీంద్రనగర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వైఎస్ షర్మిలాను, మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను శ్రీరాములు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అమర్‌నాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

ఖాజీపేట, ఏప్రిల్ 28: ప్రమాదవశాత్తు రావులపల్లెలో గడ్డివామికి నిప్పు తగులుకుని అగ్నికి ఆహుతైంది. రావులపల్లెకు చెందిన పోలు రామచంద్రారెడ్డి 700 కట్టలతో పశువులకోసం వామి ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం మంటలు తగులుకోవడంతో పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు.

వైసీపీ సర్పంచ్ బీజేపీ గూటికి

ముద్దనూరు ఏప్రిల్28:మండల పరిధి రాజులగురువాయపల్లె వైసీపీ సర్పంచ్ రాజుల రాజేశ్వరీ, ఆమె భర్త మాజీ సర్పంచ్ రాజుల శివశంకర్‌రెడ్డి ఆదివారం రాత్రి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి సమక్షంలో రాజుల శివశంకర్‌రెడ్డి ఆయనతో పాటు 200 కుటుంబాలు చేరాయి. వారికి ఆదినారాయణరెడ్డి బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

మిస్సింగ్ కేసు నమోదు

ముద్దనూరు ఏప్రిల్28:మండల పరిధి తిమ్మాపురం గ్రామానికి చెందిన భీమిచెర్ల గంగాధర్‌రెడ్డి(36) కనబడుటలేదని ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.గత నెల 28 వ తేదీన నంద్యాల జిల్లా కోవెలకుంట్లకు బంధువుల ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు 29 వ తేదీన తిమ్మాపురం వచ్చేందుకు కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండు వెళ్లి తిరిగి ఇప్పటి వరకు ఇంటికి రాలేదు. ఆయన తండ్రి భీమిచెర్ల ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వైభవంగా అంకాళమ్మ తిరుణాళ్ల



ఖాజీపేట, ఏప్రిల్ 28: మండల పరిధిలోని దుంపలగట్టు సమీపంలోగల అంకాళమ్మ తిరుణాళ్ళ వైభవంగా జరిగింది. గత నాలుగు రోజులుగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. స్థానిక సీఐ రామాంజులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అండగా ఉంటా ఆదరించండి : భూపేశ్‌రెడ్డి

ప్రొద్దుటూరు,ఏప్రిల్ 28 :ప్రొద్దుటూరులో ఆర్యవైశ్యులకు ఎప్పుడు అండగా వుంటానని ఎంపీ అభ్యర్థి చదిపిరాళ్ళ భూపేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి, నంద్యాల కొండారెడ్డి ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు, వ్యాపార వాణిజ్య సంఘాల అధ్యక్షుడు వంకదార వీరభద్రయ్య పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం మండలం బుచ్చంపల్లె, నక్కోనిపల్లె, గొల్లపల్లె, కర్మలవారిపల్లె, చిన్నకొమెర్ల గ్రామాల్లో ఆదివారం ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని చదిపిరాళ్ల గోవర్ధన్‌రెడ్డి, ఆయా గ్రామాల టీడీపీ, ఎన్డీయే కూటమి నాయకు ప్రచారం చేశారు. టీడీపీ, ఎంపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి సైకిల్ గుర్తుకు, జమ్మలమడుగు అసెంబ్లీ అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, ఎన్డీయే కూటమి నాయకులు జంబాపురం రమణారెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, సర్పంచ్ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

● **పలువురు చేరిక..:** ఎన్డీయే కూటమిలో మైలవరం మండలంలోని కర్మలవారిపల్లె గ్రామంలో పలువురు పార్టీలో చేరారు. ఎన్డీయే కూటమిలోకి కండువా కప్పి గోవర్ధన్‌రెడ్డి ఆహ్వానించారు. చేరిన వారిలో జయరామిరెడ్డి, రవీంద్రారెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రామక్రిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.



మైలవరంలో ప్రచారం చేస్తున్న నేతలు



ప్రొద్దుటూరులో ఆర్యవైశ్య ఆత్మీయ సభలో మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

కొండాపురం..: రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తరపున జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డిని, కడప ఎంపీ అభ్యర్థిగా భూపేష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల బీజేపీ ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణరెడ్డి కోరారు. మండలంలోని దత్తాపురం గ్రామంలో ఆదివారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.మే 13 న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థికి కమలం గుర్తుపైన,ఎంపీ అభ్యర్థికి సైకిల్ గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మాధవరెడ్డి,ఆదినారాయణరెడ్డి,బాలనాగిరెడ్డి, వినయ్‌కుమార్ రెడ్డి,రమణారెడ్డి,నాగిరెడ్డి,జనసేన నరసింహ,విజయ్ పాల్గొన్నారు.

అరాచకపాలన అంతం.. కూటమి పంతం

బద్వేలుటౌన్, ఏప్రిల్ 28: అరాచకపాలన అంతమే కూటమి పంతమని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, టీడీపీనాయకులు రాగిమాను ప్రతాప్‌కుమార్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీపరిధిలోని మేదరవీధిలో ఇంటింటికి వెళ్లి, కమలంపువ్వు గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. మే నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటువేసి, వైసీపీ పాలనకు చరమగీతంపాడాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాగిమాను రవితేజ, మస్తాన్‌బాబు, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, సురేంద్ర, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం,అభివృద్ధే కూటమి లక్ష్యం..: బడుగు, బలహీన వర్గాల, పేదప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి లక్ష్యమని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీశ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ రవితేజ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీపరిధిలోని 24వ వార్డు వెంకటయ్యనగర్‌లో ప్రచారం నిర్వహించారు.అనంతరం వెంకటయ్యనగర్‌లో శ్మశాన వాటిక సమస్య ఉందని ప్రజలు నాయకుల దృష్టికి తీసుకురాగా, అధికారం లోకి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, మిత్తికాయల రమణ, వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బారెడ్డి, రాగిమాను ప్రతాప్ కుమార్, గురురాజా, దానం, సుధాకర్, చరణ్, శ్రీనివాసులు, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, టీడీపీ, బీజేపీ, జనసేన పాల్గొన్నారు.

భూకబ్జాపాలకులను సాగనంపండి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 28 : భూకబ్జాలు చేసి పేదల భూములు ఆక్రమించుకునే వైసీపీ పాలకులను సాగనంపాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. ఆదివారం సాయంత్రం పోరుమామిళ్ల మండలంలోని కప్పలపల్లె గ్రామానికి చెందిన 25 కుటుంబాల వారు కోనయ్య, రామలక్ష్మిరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ చెరకూరి చెన్నరాయుడు, రావూరి నాగభూషణం ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు.కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్నను,ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డినిగెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న గెలుపు కోసం తమ్ముడు ప్రచారం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 28 : బద్వేలు నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొజ్జ రోశన్న గెలుపు కోసం ఆయన సోదరుడు బొజ్జ చిన్నయ్య ఎన్నికల ప్రచారం చేశారు. ఆదివారం ఆయన చల్లగిరిగెల, ఎస్సీ కాలనీ, యలవపల్లె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. అలాగే బీజేపీ నాయకులు కూడా బొజ్జ రోశన్న గెలుపు కోసం చెన్నారెడ్డిపేట, బొప్పాపురం ఎస్సీ కాలనీ, హరిజనవాడ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు.కమలం గుర్తుకు ఓటు వేసి బొజ్జ రోశన్నను గెలిపించాలని కోరారు.

ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలంటూ ఇంటింట ప్రచారం

బి.కోడూరు, ఏప్రిల్ 28 : ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశనన్న గెలిపించాలంటూ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి మండల పరిధిలోని గోవిందాయపల్లె, రాజుపాలెం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్నకు కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.వీరి వెంట నరసింహారెడ్డి, ఓ.వెంకట్రామిరెడ్డి, బాలిరెడ్డి, జైభరత్‌రెడ్డి, నవీన్, మద్దిరెడ్డి పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోనిమన్యంవారిపల్లె,వలసపాలెం నారాయణరావుపేట, కాటం వారిపల్లె గ్రామాల్లోని వైసీపీ నాయకులు బొజ్జ రోశన్న సమక్షంలో ఆదివారం 50 కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరు లేవాకు రామక్రిష్టారెడ్డి, పి.శేఖర్‌రెడ్డి, ఉబ్బతి రామక్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో 30 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రావు,వేణుగోపాల్‌రెడ్డి,మహేశ్వర్‌రెడ్డి,మల్లిఖార్జునరెడ్డి, రామసుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, సూర్యనారాయణ, శ్రీనివాసులరెడ్డి, జైక్రిష్టారెడ్డి, పోలిరెడ్డి రెడ్డయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపవరం..: ఇంటింటికీ ప్రచారంలో భాగంగా మండలంలోని బేతాయపల్లె, ప్రాజెక్టు కాలనీ ,పీపీకుంటలో కరపత్రాలు పంచుతూ బొజ్జ రోశన్నకు ఒక అవకాశం ఇవ్వండి అని ఆయన సతీమణి అరుణమ్మ అన్నారు. మాచుపల్లెలక్ష్మిదేవి, హబీబున్నీసా, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బద్వేలు మేదరవీధిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బొజ్జ రోశన్న



బద్వేలు..ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బొజ్జ రోశన్న, రితేష్‌కుమార్‌రెడ్డి



పోరుమామిళ్ల... విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన కప్పలపల్లెవాసులు



అట్లూరులో కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్నను సన్మానిస్తున్న దృశ్యం, పోరుమామిళ్ల బొజ్జ రోశన్న గెలుపు కోసం ప్రచారం చేస్తున్న రోశన్న సోదరుడు చిన్నయ్య

హామీలు ఏమయ్యాయి జగనన్నా..!

- అడుగున పడిన స్టీల్‌ప్లాంట్
- ముంపువాసులకు ప్రభుత్వం మొండిచెయ్యి
- గండికోటలో కనిపించని రోప్‌వే, ఒబేరాయ్ హోటళ్లు
- కనిపించని రాజోలి
- డ్రైనేజీ, రోడ్లు లేవు
- ఇదీ జమ్మలమడుగు నియోజకవర్గంలో దుస్థితి



జమ్మలమడుగు, ఏప్రిల్ 28: నియోజకవర్గంలో వైసీపీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు సీఎం జగన్ పట్టించుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమైన సమస్యలు సీఎం జగన్‌కు వెక్కిరిస్తున్నాయి. అందులో రాయలసీమకు, కడప జిల్లాలోని జమ్మలమడుగు ప్రాంతానికి గుండెకాయలాంటి స్టీల్‌ప్లాంట్ నిర్మిస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మూడు నెలల్లో రైతు దినోత్సవం పేరుతో కన్నెతీర్థం వద్ద వైఎస్ఆర్ స్టీల్ ప్లాంట్ శిలాఫలకాన్ని జగన్ టెంకాయకొట్టి ప్రారంభించారు. అప్పట్లో మూడు సంవత్సరాల్లో స్టీల్‌ప్లాంట్ పూర్తి చేసి జమ్మలమడుగు వాసులకు 70 నుంచి 75 శాతం ఉద్యోగాలు కల్పిస్తామని, సీఎంతో పాటు స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకోలేకపోయారని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల తర్వాత 2023 ఫిబ్రవరి 15న జిందాల్ పేరుతో దాని పక్కనే స్టీల్‌ప్లాంట్‌కు రెండవసారి జగన్ భూమిపూజ చేసి అదే రోజు 24 నెలల నుంచి 30 నెలలోపు స్టీల్‌ప్లాంట్ నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించినా అదీ మరుగున పడవేశారని వాపోతున్నారు. ముద్దనూరు రోడ్డులోని కొత్త రోడ్డు వద్ద నుంచి స్టీల్‌ప్లాంట్ శిలాఫలకం వరకు డబుల్ రోడ్డు పనులు చేపట్టాలని ప్లానింగ్ ద్వారా ఎక్స్‌కవేటర్ల ద్వారా దారి చేసి కొండరాళ్లను పగులకొట్టి విక్రయించుకున్నట్లుగా బహిరంగ ఆరోపణలున్నాయి. ప్రస్తుతం అసంపూర్తిగా రోడ్డు పనులు మిగిలాయి. ఆ దారిన ప్రజలు వెళ్లాలంటే గుంతల రోడ్డు, కంకర రోడ్డులో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ దారుణం

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు ఉన్నాయి. ఏ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. కొన్ని చోట్ల సిమెంటు రోడ్డు, కాలువలకు ఆనుకుని పగిలి డ్రైనేజీ నీళ్ల రోడ్డుపైకి చేరుతున్నాయి. మరికొన్ని చోట్ల డ్రైనేజీ కాలువలు చిన్నవిగా ఉండడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో జమ్మలమడుగు పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మార్పుతామని జగన్ హామీ ఇచ్చి పట్టించుకోలేదని ప్రజలు వాపోతున్నారు. అలాగే జమ్మలమడుగు నుంచి కోవెలకుంట్లవెళ్లే దారిలో మోరగుడి నుంచి గుండ్లకుంట వరకు రోడ్డు దారుణంగా ఉంది. అలాగే అళ్లగడ్డకు వెళ్లే దారి రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. అలాగే జమ్మలమడుగు, మైలవరం రోడ్డు దారుణంగా మారింది.

టెక్స్‌టైల్ పార్కు హామీ ఏమైంది ?

ఈ నియోజకవర్గంలో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారు. అందులో జమ్మలమడుగు, మోరగుడి, మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాల, వేపరాల, మైలవరం తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. టెక్స్‌టైల్ పార్కు ఆవరణంలో చేనేత కార్మికులకు చేనేత వృత్తిపై నైపుణ్యత కొరకు శిక్షణ ఇచ్చి జీవనోపాధి కల్పిస్తామని చెప్పిన సీఎం ఐదేళ్ల పాలనా కాలంలో దాని ఊసేలేదని వాపోతున్నారు.

అటకెక్కిన రోప్‌వే

పర్యాటక ప్రాంతమైన గండికోట జమ్మలమడుగు మండల కేంద్రానికి 13 కి.మీ. ఉంది. జమ్మలమడుగు నుంచి గండికోటకు ఆర్టీసీ డిపో నుంచి బస్సులు సక్రమంగా లేవని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. కాగా చంద్రబాబు హయాంలో గండికోట ఉత్సవాలను వైభవంగా నిర్వహించగా, వైసీపీ అధికారంలోకి రాగానే ఒక్కసారి మాత్రమే నిర్వహించారు. గండికోట గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. ట్యాంకులు నిర్మించినా నీటి సరఫరా లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గండికోటకు టీడీపీ హయాంలో డబుల్ రోడ్డు వేశారని, అప్పటి మంత్రి ఆదినారాయణరెడ్డి దాదాపు రూ.7 కోట్లతో రోప్‌వే నిర్మించేందుకు శంకుస్థాపన చేసి కొంతవరకు పనులు జరుగుతున్న సమయంలో 2019లో ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. అంతేకాకుండా ఇక్కడ ఒబేరాయ్ హోటళ్ల నిర్మించి అభివృద్ధి చేస్తామని చెప్పి ప్రజలకు మభ్యపెట్టడం తప్ప ఏ పనులు చేపట్టలేదని స్థానికులు వాపోతున్నారు.

టిడ్కో గృహాలకు మోక్షం లేదు

మండలంలోని గూడెం చెరువు గ్రామ పంచాయతీ పరిధిలో టిడ్కో గృహాలకు మోక్షం లేదు. టీడీపీ హయాంలో దాదాపు 90 శాతం పనులు పూర్తికాగా 1440 గృహాలు లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. లబ్ధిదారులకు గడువు విధించి అక్కడ కనీసం వసతులు కూడా ఏర్పాటు చేయలేదని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టౌన్‌బ్యాంకు బాధితుల హామీ నెరవేరలేదు

జమ్మలమడుగు పట్టణంలోని టౌన్‌బ్యాంకులో సుమారు రూ.4 కోట్లు గోల్‌మాల్ అయింది. అందులో డబ్బులు దాచుకున్న ఖాతాదారులకు వైసీపీ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత కొంత కాలానికి స్వయంగా ఎమ్మెల్యే ఖాతాదారులను వెంటబెట్టుకుని జమ్మలమడుగు పట్టణంలోని అర్బన్ పోలీసుస్టేషన్, డీఎస్పీ కార్యాలయం వద్దకు వెళ్లి న్యాయం చేయాలని అధికారులకు వినతిపత్రాలు అందించారు. కానీ ఇప్పటికీ న్యాయం జరగలేదు. అలాగే మైలవరంలోని ఏసీసీ సిమెంటు కర్మాగారం ఏర్పాటు విషయంలో, పెద్దముడియం మండలంలోని రాజోలి బాధితులకు జగన్ ఇచ్చిన హామీ నెరవేరలేదు. అలాగే కొండాపురం ముంపువాసులకు సీఎం జగన్ మొండిచెయ్యి చూపారు. రూ.10 లక్షలు ఇస్తానని నిర్దాక్షిణ్యంగా గండికోట ప్రాజెక్టుకు నీరు నింపి గ్రామాలు ఖాళీ చేయించి మౌలిక వసతులు కల్పించకుండా వదిలేశారు. అంతేకాకుండా ఎర్రగుంట్ల పట్టణం సుందరీకరణ, కాలుష్య నివారణ చేస్తామని ఆర్టీపీపీ కోసం భూములు త్యాగాలు చేసిన వారికి ఉద్యోగాల హామీ ఇచ్చి జగన్‌మోహన్‌రెడ్డి చేతులెత్తేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



స్టీల్‌ప్లాంట్ శిలాఫలకాలు



జమ్మలమడుగులో టిడ్కో గృహాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 28: ద్విచక్రవాహనంలో వెళుతున్న వ్యక్తిని కారు ఢీ కొనడంతో మృతి చెందాడు. కదిరి మండలం చామలగొంది గ్రామానికి చెందిన నారాయణప్ప(48) అనే వ్యక్తి మదనపల్లె మండలం వేంపల్లె క్రాస్ వద్ద చిన్న హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నా డు. ఈ క్రమంలో ఆదివారం హోటల్‌కు కావాల్సిన సరు కులు తీసుకుని ద్విచక్రవాహనంలో వేంపల్లె క్రాస్‌కు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నుంచి ఎగిరి పక్కనే వున్న కాలువలో పడిపోయిన నారాయణప్ప రెండు కాళ్ల పక్కటెముకలు విరిగిపోయాయి. తీవ్రంగా గాయపడిన అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో అతను మృతి చెందాడు. కాగా రోడ్డు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పారిపోయాడు. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

మామిడి చెట్లు దగ్ధం

గుర్రంకొండ, ఏప్రిల్ 28: మండలంలోని తరిగొండకు చెందిన రైతు జయచంద్రారెడ్డికి చెందిన వంద మామిడి, అల్లనేరుడు చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. రైతు పొలం చుట్టూ ఉన్న కంచెకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో మంటలు చెలరేగి మామిడితోటలోకి ప్రవేశించడంతో సుమారు వంద వరకు మామిడి, అల్లనేరుడు చెట్లు కాలిపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం తగిన సాయం అందజేసి తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

పిచ్చికుక్క వీరంగం..

- పలువురికి తీవ్రగాయాలు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 28: పిచ్చికుక్క వీరంగం సృష్టించి మనుషులతో పాటు పాడిఆవులపై కూడా దాడి చేయడంతో అనేక మంది ఆసుపత్రి పాలైన సంఘటన ఆదివారం మండంలో చోటు చేసుకొంది. గ్రామస్థుల కథనం మేరకు గుడ్రెడ్డిగారిపల్లి, యర్రప్పగారిపల్లి, కొండయ్యగారి పల్లిలో ఓ పిచ్చికుక్క విచక్షణా రహితంగా కనిపించిన వారందని కరవడంతో గ్రామస్థులు భయాందోలకు గుర య్యారు. అంతే కాకుండా పాడిఆవులను సైతం కరవడం తో రైతులు పరుగు తీశారు అనంతరం గాయపడి వారి ని ఆసుప్రతి తరలించగా ఎక్కువగా గాయపడిన వారి తిరుపతి రుయాకు తరలించినట్లు తెలిపారు. గాయపడి వారిలో శంకర, వెంకటరమణరెడ్డి, రాధాకృష్ణ, అంజలితో పాటు పలువురు వున్నారు.

ఆలస్యంగా బిల్లుల చెల్లింపులు

- ఆగిన అభివృద్ధి పనులు
- ముందుకు సాగని ఆటలు
- ప్రభుత్వ తీరుకు నిదర్శనంగా పునాదులు

కడప (ఎన్టీఆర్‌సర్కిల్), ఏప్రిల్ 28: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే మానసిక ఉల్లాసం అవసరం. అది క్రీడల వల్లనే సాధ్యం. ఈ అంశాన్ని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరినీ ఆరోగ్యంగా ఉంచాలనే ఆలోచనతో ఆడదాం ఆంధ్ర అనే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వైసీపీ పాలకులు గొప్పలు చెప్పుకొచ్చారు. ఊరూరా క్రీడ పోటీల పేరుతో నానా యాగీ చేశారు. కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి ప్రభుత్వం ఇచ్చేటువంటి ప్రైజ్‌మనీ కాకుండా తన సొంత నిధులు కూడా ఇచ్చి క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ప్రకటించి.. తరువాత సొంత నిధులు ఇవ్వకపోడంపై క్రీడాకారుల నుంచి నిరసనకు దిగిన సంఘటన చోటు చేసుకుంది. ఇక శాశ్వతంగా క్రీడా అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరు పరిశీలిస్తే... పేరు గొప్ప ఊరు దిబ్బగా ఉన్నాయి. ఈ ప్రభుత్వ హయాంలో సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో క్రీడాభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయిన పరిస్థితి నెలకొంది.

ఆగిన అభివృద్ధి పనులు



పోరుమామిళ్లలో పునాదులకే పరిమితమైన ఇండోర్ స్టేడియం



కమలాపురంలో అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం

ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు పనులను నిలిపివేశారు. దీంతో అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. జిల్లా కేంద్రంలో రూ.2కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన క్రీడా వికాస కేంద్రం పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇక్కడ భవన నిర్మాణం పనులు శ్లాబ్ లెవెల్ వరకు పూర్తయ్యాయి. కాంట్రాక్టరుకు పార్ట్ బిల్లు ఆలస్యంగా చెల్లించడంతో పనులు నిలిపివేశారు. జిల్లా కేంద్రం తరువాత అతి పెద్ద పట్టణం ప్రొద్దుటూరు ఇక్కడ కూడా రూ.2కోట్ల అంచనాలతో క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు 33.19 లక్షల రూపాయలు మాత్రమే ఖర్చు చేసినట్లు తెలుస్తుంది. భవన నిర్మాణ పనులు స్లాబ్ వరకు వచ్చాయి. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు పనులు నిలిపివేశారు. అదే విధంగా బద్వేలు నియోజకవర్గం పరిధిలోని పోరుమామిళ్లలో రూ.2కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన క్రీడా వికాస కేంద్ర నిర్మాణ పనులు పునాదులకే పరిమిత మయ్యాయి. 20.74 లక్షల రూపాయలు మాత్రమే ఇక్కడ ఖర్చు చేశారు. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులను ఆపివేశారు. రూ.2కోట్ల అంచనాతో ఏర్పాటు చేసిన క్రీడా వికాస కేంద్రం నిర్మాణ పనులు కూడా ఆగిపోయాయి. ఇక్కడ ఇప్పటి వరకు 96.83 లక్షలు ఖర్చు చేశారు. కాంట్రాక్టరుకు పార్టీ బిల్లు ఆలస్యంగా ఇవ్వడం వల్ల పనులు నిలిపివేశారు. జమ్మలమడుగు నియోజకవర్గ కేంద్రంలో రూ.2కోట్ల అంచనాతో చేపట్టిన క్రీడా వికాస కేంద్ర నిర్మాణ పనులు పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోలేదు. ఇక ఎస్సీ కాంపోనెంట్ ప్లాను పనులు కూడా అంతంత మాత్రంగా సాగుతున్నాయి. జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 11 చోట్ల క్రీడా మైదాన పనులు 14.50 కోట్ల అంచనాతో రూపొందించారు. ఈ పనులను ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించారు. అయితే ఇందులో రూ.3 కోట్ల అంచనాలతో ఆరు పనులు పూర్తి చేయగా, ఇప్పటికే ఐదు పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

శిక్షణా శిబిరాలు ప్రశ్నార్థకమే..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టవలసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు కూడా నిర్వహించడం ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారా లేదా అనేది అనుమానంగా ఉంది. నిబంధనల ప్రకారం మే 1వ తేదీ నుంచి జూన్ 5 వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడాఅంశాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమం ఉంటుందా, లేదా అనేది కూడా అధికారులకు ఇప్పటికీ స్పష్టత లేదు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వల్లూరు, ఏప్రిల్ 28: కడప - తాడిపత్రి హైవే వల్లూరు మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె వద్ద రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ప్రొద్దుటూరు ఈశ్వర్‌రెడ్డినగర్‌కు చెందిన అరుణ్‌కుమార్ తన ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. పోలీసులు ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయంపై దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడపకు తరలించామని పోలీసులు తెలిపారు.

కానిస్టేబుల్ సునీల్‌కుమార్ సస్పెన్షన్

కడప(క్రైం), ఏప్రిల్ 28: రిమ్స్ పోలీసుస్టేషన్‌లో డిస్ట్రిక్ట్ ఫ్లయింగ్ స్క్వాడ్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కె.సునీల్‌కుమార్ (పీసీ 3347)ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సిద్దార్థకౌశల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్ విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి కావడంతో ఎస్పీ సస్పెన్షన్ వేటు వేశారు. ఇదే రీతిలో శనివారం సింహాద్రిపురం కానిస్టేబుల్‌ను కూడా సస్పెన్షన్ చేశారు.

కంచె ధ్వంసం చేశారంటూ ఫిర్యాదు

పీలేరు, ఏప్రిల్ 28: పొలం చుట్టూ రాతి కూసాలతో వేసుకున్న కంచె ను కొంత మంది కావాలని ధ్వంసం చేశారంటూ పీలేరు మండలం రేగళ్ల పంచాయతీ కూరపర్తివారిపల్లెకు చెందిన ఇ.చంద్రారెడ్డి పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సర్వే నెం.284లో తన కుటుంబానికి 2.96 ఎకరాల భూమిలో రాతి కూసాలతో కంచె ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈ నేపథ్యంలో తమ ప్రత్యర్థులైన గంగారపు వెంకటేశు, గంగారపు గంగయ్యలు తమ కుమారులతో కలిసి కంచెను ధ్వంసం చేస్తున్నారని వారిని అడ్డుకో బోయిన తమపై దౌర్జన్యం చేయడమే కాకుండా కేసు పెడతామని బెదిరించారని చంద్రారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంఘ సంస్కరణ దిశగా తాళ్లపూరివారి నాటకాలు

- ప్రొఫెసరు మూలమల్లిఖార్జునరెడ్డి

కడప(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 28: వందసంవత్సరాల క్రితమే నాటి సమాజాన్ని సంస్కరించే సాంఘిక నాటకాలు రాసి తాళ్లపూరి నారాయణరావు సంఘ సంస్కర్తగా కీర్తింపబడ్డాడని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ప్రొఫెసరు మూలమల్లిఖార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో తాళ్లకూరి వారి 154వ జయంతి నిర్వహించారు. ముందుగా నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేశ్య వృత్తిని నిరసిస్తూ ఆయన రాసిన చింతామణి నాటకం కొన్ని వేల సార్లు ప్రదర్శించబడి ప్రేక్షకాదరణ పొందిందన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి, దేవకళ సత్యనారాయణ మాట్లాడుతూ కలుకూరి వారు మద్యపానం వల్ల జరిగే అనర్థాలను మధుసేవ నాటకం ద్వారా వరకట్నం వల్ల ఎదుర్కొనే ఇబ్బందులను వరవిక్రయం నాటకం ద్వారా తెలియజేశారన్నారు. కార్యక్రమంలో లింగయ్య, శ్రీనివాసరాజు, ఓబులేసు, బాల ఓబయ్యను సత్కరించారు.



నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు



చాపాడులో పనిచేయని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- వానపాములు కొనలేక.. సేంద్రియ ఎరువులు తయారు కాని వైనం
- జీతాల్లేక చెత్తను తరలించని క్లాప్ మిత్రలు

చాపాడు, ఏప్రిల్ 28: చాపాడు మండలంలో పలు గ్రామాల వద్ద నిర్మించిన చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలు నిరుపయోగంగా పడిఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీల ఆదాయం పెంచేందుకు ఈ కేంద్రాలను నిర్మించాయి. చాపాడు, లక్ష్మిపేట, వెదురూరు, సోమాపురం, పల్లవోలు, ఖాదర్‌పల్లె, అన్నవరం, మరో 15 గ్రామ పంచాయతీల్లో కేంద్రాలను నిర్మించారు. ఈ కేంద్రాల వద్ద కసువు వేసుకునేందుకు సిమెంటు తొట్లు కూడా నిర్మించారు. గ్రామాల్లో లభించే వ్యర్థపదార్థాలు అయిన కసువు, కాగితాలు, వరిగడ్డి వంటివాటితో సేంద్రియ ఎరువులు తయారు చేయాలనే లక్ష్యంతో ఈ కేంద్రాలను నెలకొల్పారు. ఈ సిమెంటు తొట్లలో వానపాములను వదిలి ఈ వ్యర్థాలతో సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించాల్సి ఉంది. ఈ సేంద్రియ ఎరువులు రైతులు పసుపు, పూలతోటలు, వేరుశనగ, పండ్ల తోటలకు వినియోగిస్తే పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది. ఇలాంటి మంచి ఉద్దేశ్యంతో ఈ కేంద్రాలను నిర్మించారు.

ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులు వానపాములను కొనుగోలు చేయలేకపోతున్నారు. లక్ష్మిపేట, పల్లవోలు గ్రామాల్లోని కేంద్రాల్లో మాత్రమే వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారు. ఈ కేంద్రాలు కూడా నాలుగు నెలల నుంచి మూతపడ్డాయి. క్లాప్ మిత్రలకు జీతాలు సక్రమంగా ఇవ్వడంలేదు. సుమారు రెండేళ్లపాటు జీతాలు ఇవ్వకపోడంతో క్లాప్‌మిత్రలు పనిచేసేందుకు ఆసక్తి చూపడంలేదు. దీంతో ఈ పథకం లక్ష్యం నెరవేరలేదు. ఒక్కొక్క కేంద్రాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలతో నిర్మించారు. ప్రతి గ్రామంలో సిమెంటు తొట్లు కూడా ఏర్పాటు చేశారు. ఇళ్లల్లోని కసువు ఈ తొట్లలో నింపుతున్నారు. ఈ కసువును క్లాప్ మిత్రలు కేంద్రాలకు చేర్చడం లేదు. జీతాలు సక్రమంగా రానందున వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి కసువు వేసుకునేందుకు డస్ట్‌బిన్‌లు సరఫరా చేసింది. కానీ అధికారులు ఈ డస్ట్‌బిన్‌లను ఇంకా కొన్ని గ్రామాలకు పంపిణీ చేయలేదు. నాలుగేళ్లుగా ఈ కేంద్రాలను జిల్లా అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఇవి నామమాత్రంగా పడి ఉన్నాయి. గ్రామాలు పరిశుభ్రంగా కూడా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ కేంద్రాలు పనిచేయకపోవడంతో గ్రామాలు అపరిశుభ్రంగా మారాయి.. ఇప్పటికైనా జిల్లా అధికారులు నిధులు విడుదల చేసి కేంద్రాలు పనిచేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న సిమెంటు తొట్లు